



నువ్వే మా గేమ్ చేంజర్: బాబాయ్ పవన్‌ను హత్తుకున్న రామ్‌చరణ్

గేమ్ చేంజర్ షో

డిప్యూటీ సీఎం పవన్.. మెగా హీరో రామ్‌చరణ్.. దర్శకుడు శంకర్ ఇలా అతిరథ మహారథులందరూ వస్తుంటే.. అభిమానం ఊరుకుంటుందా.. ఎగసిపడింది.. ఉవ్వెత్తున ఉరకలేసింది.. తమ అభిమాన నటీనటులను నేరుగా చూడాలని ఎక్కడెక్కడి నుంచో తరలిరావ డంతో వేమగిరి జనసంద్రమైంది.. ఇసుకేసినా రాలనంత జనం.. ఎక్కడి నుంచి వచ్చారో కానీ శనివారం మధ్యాహ్నం 2 గంటల నుంచే జాతీయ రహదారి యువతతో నిండిపోయింది.. సాయంత్రం ఐదు గంటలయ్యే సరికి కిక్కిరిసిపోయింది.. అభిమానులను అదుపుచేయడం ఎవరితరం కాలేదు..వీవీఐపీ.. వీఐపీ పాస్‌లు పనిచేయలేదు.. అయినా అభిమానులు కదల్లేదు.. జై పవన్.. జై రామ్‌చరణ్ అంటూ ముందుకు కదిలారు..గేమ్ చేంజర్ ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను విజయవంతం చేశారు. - వివరాలు 6లో



వేదికపై మాట్లాడుతున్న పవన్ చిత్రంలో శంకర్, సూర్య, దిల్ రాజు



స్టేజ్‌పై యాంకరింగ్ చేస్తున్న సుమ.. పక్కనే నటి అంజలి



అభిమాన దండ...



మాట్లాడుతున్న దర్శకుడు శంకర్



అభిమాన సంద్రం: వేమగిరిలో కిక్కిరిసిన గేమ్ చేంజర్ ప్రీ రిలీజ్ ఈవెంట్ ప్రాంగణం



మధ్యాహ్నం స్టేజ్ వద్ద కిక్కిరిసిన అభిమానులు

నేడు 'ఆంధ్రజ్యోతి' ముగ్గుల పోటీ

» కాకినాడ పీఆర్ కాలేజీ ఎదురుగా మెక్లారిన్ గ్రౌండ్‌లో ఏర్పాట్లు

కాకినాడ, జనవరి 4(ఆంధ్రజ్యోతి): కాకినాడ నగరంలో ఆంధ్రజ్యోతి ముత్యాల ముగ్గుల పోటీ ఆదివారం జరగనుంది. ఏబీఎన్ ఆంధ్రజ్యోతి, సంతూర్ ఆధ్వర్యంలో గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్ వారిపర్‌ఫెక్ట్ .. ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) నేతృత్వంలో జరుగుతాయి. ఈ పోటీలకు లోకల్ స్పాన్సరర్‌గా ఎమ్మెల్సీ(నామినేటెడ్) కర్రి పద్మశ్రీ జిల్లా స్పాన్సర్‌గా వ్యవహరిస్తున్నారు. కాకినాడ పీఆర్ కాలేజీ ఎదురుగా ఉన్న మెక్లారిన్ హైస్కూల్ మైదానంలో పోటీలు ఉదయం పదిగంటలనుంచి ప్రారంభమవుతాయి. పోటీలో పాల్గొనే మహిళలకు ప్రథమ బహుమతి రూ.6వేలు, ద్వితీయ బహుమతిగా రూ.4వేలు, తృతీయ బహుమతిగా రూ.3వేలు ఇవ్వనున్నారు. పోటీలో పాల్గొనే మహిళలకు కన్సొలేషన్ బహుమతులు అందజేయనున్నారు. పోటీలకుఅతిథిగా ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ హాజరుకానున్నారు. ముఖ్యఅతిథులుగా ప్రత్తిపాడు టీడీపీ ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన రానున్నారు. ఏబీఎన్ ఆంధ్రజ్యోతి నిర్వహించే ఈ ముత్యాల ముగ్గుల పోటీకి మహిళలు అధికసంఖ్యలో నేరుగా హాజరుకావచ్చు. ఎవరి ముగ్గులు వారే తెచ్చుకోవాలి. చుక్కల ముగ్గుకు మాత్రమే ప్రాధాన్యం ఉంటుంది.



డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ప్రారంభం

» హాజరైన కలెక్టర్, పెద్దాపురం ఎమ్మెల్యే చినరాజప్ప

సామర్లకోట, జనవరి 4(ఆంధ్రజ్యోతి): పోటీ ప్రపంచంలో నిలదొక్కుకునేందుకు విద్యార్థి దశలో ఇంటర్మీడియట్ చదువు చాలా కీలకమని, విద్యార్థులు మత్తు పదార్థాలకు అలవాటు పడి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ఉద్బోధించారు. ప్రభుత్వం నూతనంగా ఇంటర్మీడియట్ కళాశాల విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం జిల్లాలో అమలు ప్రారంభంలో భాగంగా సామర్లకోట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్పతో కలిసి శనివారం కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంతో కళాశాలలో డ్రాపవుట్స్‌ను నిరోధించడంతోపాటు విద్యార్థుల భవిష్యత్తుకు మంచి పునాది వేసేందుకు గొప్ప అవకాశం ఉంటుందన్నారు. ఈ పథకం కింద జిల్లాలో 14 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 5,798మంది విద్యార్థులకు మేలు కలగనుందన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర పథకం కింద 2లక్షల మంది విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్స్ పుస్తకాలు ఇచ్చామన్నారు. శతాబ్దం కాల చరిత్ర గల సామర్లకోట ప్రభుత్వ జూనియర్ కళాశాలను డిగ్రీ కళాశాలగా అప్‌గ్రేడ్ చేయించేందుకు కృషిచేస్తానని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప భరోసాఇచ్చారు. విద్యార్థులకు అమలుచేసే మధ్యాహ్న భోజన పథకానికి డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అని పేరు పెట్టడం శుభపరిణామమన్నారు. కార్యక్రమంలో కుడా చైర్మన్ తుమ్మల రామస్వామి(బాబు) ప్రసంగించారు. కార్యక్రమంలో డీవైఈవో జీ.నూకరాజు, ఏడీ వినయ్‌మోహన్, ఎంఈవోలు వై.శివరామకృష్ణయ్య, పట్టపగలు పుల్లయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ జి.అరుణ, వైస్‌చైర్మన్ గోకిన సునేత్రాదేవి పాల్గొన్నారు.



సామర్లకోటలో మధ్యాహ్న భోజనాన్ని వడ్డిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే చినరాజప్ప

1,34,672 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

» 277 రైతుసేవా కేంద్రాల ద్వారా రైతుల ఖాతాల్లో రూ.305కోట్లు

» ధాన్యం విక్రయించిన 48 గంటల లోపు సొమ్ములు జమ

కలెక్టరేట్(కాకినాడ), జనవరి 4(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతు సేవా కేంద్రాల ద్వారా పౌరసరఫరాలశాఖ 1,34,672 మెట్రిక్‌ధాన్యాన్ని కొనుగోలు చేసింది. ఈధాన్యాన్ని జిల్లాలో 22923మంది రైతుల నుంచి కొనుగోలు చేసింది. మొత్తం రూ.309 కోట్ల రైతులకు చెల్లించాల్సి ఉండగా ఇప్పటి వరకు రూ.305కోట్ల రైతుల బ్యాంకు ఖాతాల్లో జమచేసింది. మరో రూ.4కోట్లు రెండురోజుల్లో జమకానుంది. ఈ నేపథ్యంలో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత ఐదేళ్లలో రైతులు ప్రభుత్వానికి ధాన్యం విక్రయిస్తే చుక్కలు చూడాల్సిన పరిస్థితి. అమ్మిన ధాన్యానికి నెలల తరబడి సొమ్ములు రైతు బ్యాంకు ఖాతాల్లో జమకాకపోవడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయేవారు. పైగా తేమశాతం పేరిట రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసేవారు. దీంతో ప్రభుత్వం నిర్వహించే కొనుగోలు కేంద్రాలకు వెళ్లాలంటే రైతులు భయపడేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితి పూర్తిగా మారిపోయింది. రైతులు విక్రయించిన ధాన్యానికి 48గంటల్లో సొమ్ములు జమ చేస్తున్నారు. జిల్లాలో 21 మండలాల పరిధిలో 277 రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు జరుగుతుంది. ఖరీఫ్‌కు సంబంధించి 93శాతం వరకు కోతలు పూర్తయ్యాయి. రైతులనుంచి ధాన్యం కొనుగోలు చేయడానికి సిద్ధంగానే ఉన్నామని జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ దేవుల నాయక్ తెలిపారు. ఎంత మొత్తం ధాన్యం అయినా కొనుగోలు చేస్తామని, విక్రయించిన 48 గంటలలోపు సొమ్ములు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ అవుతున్నాయని తెలిపారు.

రేషన్‌బియ్యం పక్కదారి పట్టిన వ్యవహారంలో.. 10కి చేరిన కేసులు

కాకినాడ క్రైం, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ద్వారా పేదలకు పంపిణీ అయ్యే పీడీఎస్ రేషన్‌బియ్యం పక్కదారి పట్టిన కేసులు కాకినాడ పోర్టు పోలీస్‌స్టేషన్‌లో 10కి చేరాయి. ఈ వ్యవహారంలో 50మందిని అరెస్ట్ చేయగా, మొత్తం 29,870.785 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని పోలీసులు, సివిల్ సప్లైస్ అధికారులు కలిసి సీజ్ చేశారు. ఈ వ్యవహారంలో గత నెల 20న 0073 బార్జిలో రూ.4.60కోట్ల విలువైన 1,064 టన్నుల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న అధికారులు ఆ బార్జికి సంబంధించిన లవణ్ ఇంటర్నేషనల్ అనే సంస్థపై 6ఏ కేసు నమోదు చేశారు. అనంతరం పోర్టు పోలీసులకు డీటీ శ్రీనివాస్‌రావు ఫిర్యాదు చేశారు. దీంతో ఆ సంస్థ ఎండీ కొటారి అమిత్‌కుమార్ జైన్, సూపర్‌వైజర్ రవికుమార్‌పై 318(4) బీఎన్ఎస్, 7(1) ఈసీఏ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. స్టెల్లా ఎల్ నౌకలోనే 1,320 టన్నుల పీడీఎస్ బియ్యం అక్రమ నిల్వ వ్యవహారంలో సత్యం బాలాజీ రైస్ ఇండస్ట్రీస్ ప్రైవేటు లిమిటెడ్ పై సివిల్‌సప్లైస్ అధికారులు 6ఏ కేసు నమోదు చేశారు. సంస్థ యజమాని ప్రదీప్ అగర్వాల్, సూపర్‌వైజర్ కళ్యాణ్ అశోక్‌లపై సీఎస్ డీటీ శ్రీనివాస్‌రావ్ పోర్టు స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. ఈ కేసులపై వివిధ శాఖల సమన్వయంతో లోతుగా దర్యాప్తు జరుగుతున్నట్లు పోర్టు సీఐ సునీల్ కుమార్ తెలిపారు.



గిరిజన మహిళలతో దింసా నృత్యం చేస్తున్న ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ

గిరిజన మహిళలతో ఎమ్మెల్సీ దింసా నృత్యం

కార్పొరేషన్(కాకినాడ), జనవరి 4(ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కాకినాడ ఐటీఐ ప్రాంగణంలో జరుగుతున్న ఉమెన్ ఎంట్రప్రెన్యూర్ ట్రేడ్ ఫెయిర్‌లో భాగంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా కాకినాడ ఉమెన్స్ కాలేజ్ విద్యార్థులు ప్రదర్శించిన జానపద, గిరిజన సంప్రదాయ నృత్యాలు అలరించాయి. డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీరమణి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ పద్మశ్రీ పాల్గొని విద్యార్థులతో కలిసి నృత్యం చేశారు. అనంతరం విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రేడియో అల 90.8 ఎఫ్ఎం స్టేషన్ డైరెక్టర్ మలిరెడ్డి సత్య, సోషల్ యాక్టివిస్ట్ అల్లూరి సురేంద్ర, జేఎన్‌టీయూ ప్రొఫెసర్ ఆలపాటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేటి నుంచి యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలు 7
సంక్రాంతికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు 7
మహిళా కానిస్టేబుల్ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు 7



గేమ్ చేంజర్ వచ్చేశాడు!



బాబాయ్ ఎలా చెబితే అలా : పవన్ పక్కన చేతులు కట్టుకుని నిలబడిన రామచరణ్

రాజమహేంద్రవరం/కడియం,జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ నటుడు రామ్ చరణ్ నటించిన గేమ్‌చేంజర్ సినిమా ప్రీరిలీజ్ ఈవెంట్‌కు గోదావరి జిల్లాల నుంచే కాక,ఇతర ప్రాంతాలనుంచి అత్యధికంగా యువత తరలివచ్చారు. మహిళలు కూడా భారగా రావడం గమనార్హం. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం సమీపంలోని వేమగిరి హైవే పక్కన బ్రహ్మాండమైన వేదిక మీద ఈవెంట్ జరిగింది. జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించి యువతను ఉర్రూతలూగించింది.అంతకుమందు మధురపూడి ఎయిర్‌పోర్టులో రామ్‌చరణ్‌కు అభిమానులు ఘనస్వాగతం పలికారు. తర్వాత డిప్యూటీ సీఎం పవన్ కూడా ప్రత్యేక విమానంలో మధురపూడి ఎయిర్‌పోర్టుకు చేరుకుని అక్కడినుంచి రోడ్డు మార్గంలో సభాప్రాంగణానికి చేరుకున్నారు. సాయంత్రం 7గంటల సమయంలో పవన్, రామ్‌చరణ్ వేదిక మీదకు చేరుకున్నారు. యాంకర్ సుమ సభను ఉత్సాహపరిచారు.గోదావరి ప్రాంతాల్లో సినిమా మొదటి రోజునే చూడడానికి యువత ఇష్టపడతారని పవన్ అన్నారు.ఈ ప్రాంతంలో యువతకు ఉపాధి చూపించే విధంగా స్టూడియోలు, స్టంట్ స్కూళ్లు, ట్రైనింగ్ స్కూళ్లు పెట్టాలని నిర్మాతలకు ఆయన సూచించారు. పవన్, రామ్‌చరణ్ ఒకే వేదిక మీద ఉండ డంతో అభి మానుల ఆనందానికి అవధుల్లేవు. మధ్యాహ్నం నుంచే అభిమానులు వేదిక వద్దకు భారీగా చేరుకోవడంకనిపించింది. సాయంత్రానికి జనం తాకిడి పెరిగి పాస్‌లు ఉన్నప్పటికీ లోపలికి పంపించలేదు. సాయంత్రం నుంచి వేదికపై ప్రత్యేక సాంస్కృతిక ప్రదర్శనలు, నృత్యాలతో పలువురు అలరించారు. ఆ తర్వాత సినీ పరిశ్రమకు చెందిన పలువురు మాట్లాడారు. సంగీత దర్శకుడు తమన్ తన ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. ఈ వేదిక మీద ప్రముఖ దర్శకుడు శంకర్, ప్రముఖ నటుడు ఎస్‌జే సూర్యహీరోయిన్ అంజలి, మరో హీరో శ్రీకాంత్, దిల్‌రాజు వంటి వారితో పృథ్వీరాజు తదితరులు అనేక మంది వేదిక మీద ఉండడం అందరికీ సంతోషాన్నిచ్చింది.జిల్లాకు చెం దిన మంత్రి దుర్గేష్,ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్యచౌదరి,ఆదిరెడ్డి వాసు,బత్తుల బలరామకృష్ణ, ఎమ్మెల్సీ హరిప్రసాద్ తదితరులు హాజరయ్యా రు.రాజమహేంద్ర వరం వైపు నుంచి బొమ్మూరు నుంచి ట్రాఫిక్ జామ్ సమస్య ఏర్పడింది. అయినా పోలీసు బందోబస్తు ఉండడంవల్ల అంతా బాగానే జరిగింది.వేమగిరి వైపు నుంచి అధికంగా యువత తరలివచ్చా రు.ఈవెంట్ ఏర్పాట్లను చిరంజీవి రాష్ట్ర యు వత ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షుడు రవణం స్వామినాయుడు,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏడిద బాబీ తదితరులు పర్యవేక్షించారు. బాబాయ్ .. అబ్బాయ్‌లకు గజమాల వేశారు.

నేషనల్ అవార్డు స్థాయిలో రామ్‌చరణ్ నటన : దిల్‌రాజు, నిర్మాత



రాష్ట్రంలో జరిగే అంశాలను గేమ్‌చేంజర్ సినిమాలో చూపించడం జరిగింది.గేమ్‌చేంజర్‌లో నేషనల్ అవార్డు వచ్చే స్థాయిలో రామ్‌చరణ్ నటన ఉంటుంది. సినిమా అందరికీ నచ్చుతుంది. కల్యాణ్‌గారికి ప్రత్యేక కృతజ్ఞతలు. టిక్కెట్ ధరల పెంపుపై ఏపీ ప్రభుత్వానికి కూడా కృతజ్ఞతలు.

ఎదిగిన కొద్దీ ఒదిగి ఉంటాడు : శ్రీకాంత్

దర్శకుడు శంకర్ నామీద నమ్మకంతో కారెక్టర్ ఇచ్చారు. రామ్‌చరణ్‌తో నటించడం ఇది రెండో సినిమా. రామ్‌చరణ్ ఎదిగిన కొద్దీ ఒదిగి ఉండే మనస్తత్వం. ఒక సందర్భంలో దర్శకుడు సుకుమార్ మాట్లాడుతూ గేమ్‌చేంజర్‌కు నేషనల్ అవార్డు వస్తుందని చెప్పడం నాకు ఎంతో సంతోషాన్నిచ్చింది.



కూటమి నేతృత్వంలో సినిమా పాలసీ

పేదవారి కంటనీరు తుడవడమే లక్ష్యంగా డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ రాజకీయాలను నడుపుతున్నారు. తెలుగు సినీచరిత్రలో తండ్రికి తగ్గ తనయుడిగా గ్లోబల్‌స్టార్ రామ్‌చరణ్ అభిమానుల గుండెల్లో స్థానాన్ని సంపాదించుకున్నారు. గేమ్‌చేంజర్ ఈవెంట్ గోదావరి నదీతీరాన వెలసిన రాజమహేంద్రవరంలో జరగడం ఆనందంగా ఉంది. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లు రాష్ట్ర రాజకీయాల్లో కీలకమార్పులు తీసుకువచ్చేలా కృషి చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం పవన్‌కల్యాణ్ నేతృత్వంలో సినిమా పాలసీని తీసుకురావడానికి సిద్ధంగా ఉంది. దిల్‌రాజు వంటి నిర్మాతలు ఆంధ్రరాష్ట్రం వైపు కూడా దృష్టిసారించాలి.

- మంత్రి కందుల దుర్గేష్



రామ్‌చరణ్ నటన అద్భుతం..

నా 30 ఏళ్ల సినిమా చరిత్రలో 14 సినిమాలు తీశా. అన్ని సినిమాలను తెలుగులో డబ్బింగ్ చేశాం. డబ్బింగ్ అయినా.. నాపై ప్రేమ చూపారు. మీకు తిరిగి ఏదొకటి ఇవ్వాలన్న ఆలోచనతో పూర్తి తెలుగు సినిమా తీశాను. మొత్తం తెలుగు సంస్కృతి సంప్రదాయాలు ఉండేలా సినిమా తీశాం. రామ్‌చరణ్ ప్రతి క్యారెక్టర్ అద్భుతంగా చేశారు. సినిమా బృందంలో పనిచేసిన అందరికీ కృతజ్ఞతలు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ మంచి మనసున్న వ్యక్తి. ఆయన ఒక్కరే అందరిలోను గుండెను చూసే వ్యక్తి. రాజమహేంద్రవరంలో ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించడం ఆనందంగా ఉంది.

-సినీ దర్శకుడు శంకర్



మాట్లాడుతున్న పవన్ చిత్రంలో శ్రీకాంత్, హీరోయిన్లు..



మాట్లాడుతున్న హీరో రామ్‌చరణ్ చిత్రంలో శ్రీకాంత్, హీరోయిన్లు, తమన్



స్టేజ్ కింద కూర్చున్న పవన్, రామ్‌చరణ్, శంకర్ తదితరులు ...

ఎట్టకేలకు పయనమవుతున్న స్టెల్లా ఎల్ నౌక

- నేడు అర్ధరాత్రి కాకినాడ యాంకరేజ్‌పోర్టు నుంచి ప్రయాణం
- 26 రోజులు సముద్రంలో పయనించి పశ్చిమాఫ్రికాలో బెనిన్ దేశానికి...
- రేషన్ బియ్యం ఎగుమతి ఆరోపణలో 55రోజులపాటు కాకినాడ తీరంలోనే ఉండిపోయిన నౌక
- నౌకలో ఉన్న 1320 మెట్రిక్ టన్నుల రేషన్‌బియ్యం ప్రభుత్వ గోదాములకు తరలింపు



నేడు అర్ధరాత్రి పశ్చిమ ఆఫ్రికాకు బయలుదేరేందుకు సిద్ధంగా ఉన్న స్టెల్లా ఎల్ నౌక

కలెక్టరేట్(కాకినాడ), జనవరి 4(ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు స్టెల్లా ఎల్ పనామానౌక బయలుదేరుతుంది. ఆదివారం అర్ధరాత్రి కాకినాడ యాంకరేజ్ పోర్టు నుంచి బయలుదేరేందుకు సర్వం సిద్ధమైంది. ఈభారీనౌక 26రోజులపాటు సముద్రంలో పయణించి పశ్చిమాఫ్రికాలో బెనిన్ దేశంలో కొటోనౌ పోర్టుకు చేరుకుంటుంది. అంటే ఈనెల 31వ తేదీకి గమ్యం చేరుకోగలదని నౌక అధికారులు చెబుతున్నారు. ఆదివారం అర్ధరాత్రి బయలుదేరుతున్న ఈనౌకలోకి ఎగుమతికి సిద్ధం చేసిన 52వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని లోడింగ్ చేశారు. రేషన్ బియ్యం నౌకలో ఉండటంతో 55రోజులపాటు కాకినాడ సముద్ర తీరంలోనే నౌక లంగరేసుకుని ఉండిపోయింది. ఈనౌక నవంబరు 21వ తేదీన కాకినాడ తీరానికి వచ్చింది. దీనిలోకి 32,415 మెట్రిక్ టన్నుల బియ్యం లోడింగ్ అయిన తర్వాత రేషన్ బియ్యం ఉన్నట్లు అధికారులకు సమాచారం వచ్చింది. దీంతో తొలుత జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ తనిఖీలు చేశారు. తర్వాత డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ తనిఖీలు నిమిత్తం వెళ్లారు. వాతావరణం అనుకూలించకపోవడంతో నౌకలోకి వెళ్లకుండా వెనుదిరిగారు. తర్వాత అధికారుల బృందం వెళ్లి తనిఖీలుచేసి 12న మూనాలు సేకరించారు. 1320 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యం ఉన్నట్లు ప్రకటించారు. దాదాపు వారం రోజులు శ్రమించి ఆ బియ్యాన్ని దించి ఒడ్డుకు చేర్చారు. ఎగుమతికి సిద్ధంగా ఉన్న మిగిలిన 19785 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని లోడింగ్ పూర్తి చేశారు. దీంతో నౌక వెళ్లేందుకు ఎలాంటి ఇబ్బందులు లేవు. నౌక బయలు దేరుతుంది.

సత్యం బాలాజీపై కేసు నమోదు

సత్యం బాలాజీ రైస్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్‌పై పౌరసరఫరాల శాఖ అధికారులు 6ఏ కేసు నమోదు చేశారు. సీఎస్‌డీటీ శ్రీనివాసరావు కాకినాడపోర్టు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. సంస్థ యజమాని ప్రదీప్ అగర్వాల్, సూపర్‌వైజర్ కల్యాణపు అశోక్‌లపై చర్యలు తీసుకోవాలని సూచించారు. స్టెల్లా ఎల్ పనామా నౌకలో 1320 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యం సత్యం బాలాజీ రైస్ ఇండస్ట్రీస్‌కు చెందినవే. ఈ నేపథ్యంలో కేసులు నమోదయ్యాయి.



ప్రత్యేక అలంకరణలో వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి, తిరు వీధులలో ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

గోవింద నామస్మరణతో హోరెత్తిన వాడపల్లి

- వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తజనం
- ఒక్కరోజు ఆదాయం రూ.32.99లక్షలు

ఆత్రేయపురం, జనవరి4(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తజనం పోటెత్తారు. వేకువజామునే స్వామివారికి సుప్రభాతసేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మీహోమం, భాలబోగం తదితర కార్యక్రమాలను, శాస్త్రోక్తం గా నిర్వహించి స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారి తిరువీధులలో ఏడు ప్రదక్షణలుచేసి మొక్కులు తీర్చుకున్నారు. భారీ క్యూలైన్లలో స్వామివారిని దర్శించుకున్న భక్తులు తులాభారాలు, కానుకులు సమర్పించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. అనంతరం రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. వివిధ సేవల ద్వారా స్వామి వారి ఒక్కరోజు ఆదాయం రూ.32.99,056 లక్షలు లభించినట్టు ఉపకమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. విశాఖపట్నానికి చెందిన మహిళలు కోలాట ప్రదర్శన భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది.

సత్రం గదులు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలి

- ఈవో సుబ్బారావు



శివసదన్ కాటేజీని పరిశీలిస్తున్న ఈవో సుబ్బారావు

అన్నవరం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో ఉన్న సత్రంగదులు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని ఈవో సుబ్బారావు పేర్కొన్నారు. శనివారం ఆయన శివసదన్ కాటేజీ, విష్ణుసదన్ కాటేజీలను పరిశీలించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. గదుల్లో ఏమైనా ఇబ్బందులు, మరమ్మతులు ఉంటే తక్షణమే పరిస్కారంకావాలని సూచించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు ఉన్నారు.

సత్యదేవుడికి వేడుకగా ప్రాకారసేవ

రత్నగిరివాసుడైన సత్యదేవుడికి శనివారం ప్రాకారసేవ వేడుకగా జరిగింది. ఉదయం 10గంటలకు స్వామి,అమ్మవార్లను తిరుచ్చి వాహనంపై ఆశీనులు గావించి ప్రధాన రాజగోపురం చుట్టూ ముమ్మారు భక్తుల గోవిందనామస్మరణలు, పండితుల మంత్రోచ్చరణల నడుమ ప్రదక్షణ గావించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్‌లు ఐ.వి.రామారావు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



తిరుచ్చిపై విహరిస్తున్న స్వామి,అమ్మవార్లు

లక్ష్యాన్ని చేరుకున్న డొంకరాయి విద్యుత్ ఉత్పత్తి కేంద్రం



కేక్ కట్ చేసి అభినందనలుతెలుపుకుంటున్న ఉద్యోగులు

మోతుగూడెం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): వై.రామవరం మండలం బొడ్డగండి పంచాయతీ డొంకరాయి సీలేరు కాంప్లెక్స్ పరిధిలో ఉన్న డొంకరాయి జలవిద్యుత్ కేంద్రం జల ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకుంది. 2024-25కి డొంకరాయి విద్యుత్ అథారిటీ అధికారులు 95.14 మిలియన్ యూనిట్లు ఉత్పత్త లక్ష్యంగా నిర్ణయించారు. ఈ టార్గెట్ 2025 మార్చి 31 పూర్తి చేయాల్సి ఉండగా నిర్దేశించిన సమయాని కంటే మూడు నెలల ముందు 2024 డిసెంబరు 26 నాటికి 95.14 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తిని చేయడంతో అనుకున్న టార్గెట్ పూర్తయిందని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావు డొంకరాయి విద్యుత్ కేంద్రంలో సిబ్బందిని అభినంచారు. దీంతో కేక్ కట్‌చేసి ఉద్యోగస్తులు సంబరాలు చేరుకున్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజనీర్ చిన్న కామేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భాస్కరరావు, ఏడీఈ లు, చంద్రమోహన్, శ్రీనివాసరావు, జెన్‌కో సిబ్బంది పాల్గొన్నారు.

రామ్‌చరణ్‌కు ఘన స్వాగతం

కోరుకొండ, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ హీరో, గ్లోబల్ స్టార్ కొణిదెల రామ్‌చరణ్‌కు మధురపూడి విమానాశ్రయం వద్ద రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, జనసేన నాయకుడు తోట నవీన్ ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయనను సత్కరించి పుష్పగుచ్ఛాలు అందజేశారు. గేమ్‌ఛేంజర్ ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో పాల్గొనేందుకు ఆయన శనివారం మధురపూడి విమానాశ్రయానికి విచ్చేశారు. ఈ సందర్భంగా పలువురు స్వాగతం పలికారు.



మధురపూడి విమానాశ్రయం వద్ద రామ్‌చరణ్‌కు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, తోట పవన్‌కుమార్

ఆర్టీసీ బస్సు బ్రేకులు ఫెయిల్

- గ్రామంలో భీభత్సం
- తప్పిన ప్రమాదం



బస్సు వెనుక పరుగులు తీస్తున్న స్థానికులు

రాజవొమ్మంగి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): రాజవొమ్మంగి గ్రామంలో శనివారం ఆర్టీసీ బస్సు భీభత్సం సృష్టించింది. నర్సీపట్నం నుంచి ఏలే శ్వరం వెళుతున్న ఆర్టీసీ బస్సు రాజవొమ్మంగి గ్రామ సమీపంలోకి వచ్చే సరికి బ్రేకులు ఫెయిల్ అయ్యాయి. దీంతో బస్సులో ఉన్న ప్ర యాణికులు బస్సు వెళుతుండగానే బస్సు నుంచి బయటకు దూకారు. సుమారు కిలోమీటరు మేర బస్సు ముందుకు వెళ్లింది, దీం తో గ్రామస్థులు, బస్సుకోసం వేచివున్న ప్ర యాణికులు దూరంగా పరుగులు తీశారు. బస్సు గ్రామంలోకి వచ్చాక డ్రైవర్ చాకచక్యంగా బస్సును 99 క్వార్టర్స్ వైపు తీశాడు.

స్థానికులు బస్సుకు బ్రేకులు ఫెయిల్ అయిన విషయం గమనించి బస్సు టైర్లకు అడ్డగా సిమెంట్ ఇటుకలు, తదితర రాళ్లు వేశారు, బస్సువేగం తగ్గడంతో డ్రైవర్ బస్సును డ్రైవర్ చాకచక్యంగా నిలిపివేశాడు. ఈ ఆర్టీసీ బస్సు నిత్యం రిపేర్‌లోనే ఉంటుందని, శనివారం ఉదయం ఏలేశ్వరం-నర్సీపట్నం మధ్యలో ఘాట్ రోడ్డులో బస్సు నిలిచిపోయిందని ప్రయాణికులు, ఆర్టీసీ సిబ్బంది తెలిపారు. అత్యంత ప్రమాదకరమైన ఘాట్‌రోడ్డులో తిరిగే బస్సులను కండీషన్‌లో ఉండేలా చూడకపోవడంపై స్థానికులు, ప్రయాణికులు మండిపడుతున్నారు.

వేతనదారులకు తీపి కబురు!

- ఇకపై ఉపాధి హామీ పథకం పకడ్బందీగా అమలు
- కనీస వేతనం రూ.300కి పెంపు
- బోగస్ మస్తర్లకు చెక్ పెట్టేందుకు ప్రత్యేక కమిటీలు
- వేతనదారుల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం చర్యలు



పెద్దాపురం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం వేతనదారులకు ప్రభుత్వం తీపి కబురు తెలిపింది. ఇకపై ఉపాధి హామీ పథకాన్ని పకడ్బందీగా అమలుచేయడంతో పాటు వేతనదారుల కనీస వేతనాన్ని రూ.263 నుంచి రూ.300కి పెంచి ఇవ్వటానికి ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటుచేసింది. ఈ విభాగం బోగస్ మస్తర్లకు అడ్డుకట్టవేయడంతో పాటు పనివేళల్లో మార్పులుచేసి వేతనదారులకు గిటుబాటు వేతనం అందించేందుకు పర్యవేక్షణ చేయనుంది. ఈ విభాగానికి డ్వామాలో కీలకంగా జిల్లా విజిలెన్స్ అధికారిని నియమించింది. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం వేతనదారులు ప్రస్తుతం నాలుగు గంటలు పాటు పనిచేస్తున్నారు. అదనంగా మరో గంట పెంచేలా చూడాలని ప్రభుత్వం సూచించింది. ఉపాధి సిబ్బంది, ఏపీడీలు, ఏపీవోలు, ఎంపీడీవోలు నిత్యం మస్తర్లు తనిఖీ చేయాలి. ఈతరహా చర్యలతో వేతనాదారులకు సగటున మూడు వందల రూపాయల వేతనం లభిస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ మొత్తం అందాలంటే ఏయే పనులు ఎంత సమయంలో చేయాల్సి ఉంటుందనే అంశాలపై జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసిన వేతన పర్యవేక్షణ విభాగం పర్యవేక్షిస్తుంది.

నిబంధనలు ఇవే..

ఉపాధి వేతనదారులకు వేతనం పెరగడానికి ప్రభుత్వం నిబంధనలు రూపొందించింది. ముందస్తుగా అంచనాలు తయారుచేయాలి. నేల స్వభావం, వేతనదారుల పనిచేయడానికి అనువుగా ఉండేలా గుర్తించాలి. జిల్లాను యూనిట్‌గా తీసుకుని పనులు కల్పించాలి. పనివేళల్లో మార్పులు చేయాలి. సాంకేతిక సహాయకులు నిత్యం పర్యవేక్షించాలి. ఏపీడీ, ఏపీవో, ఎంపీడీవోలు మస్తర్లు తనిఖీ చేయాలి. వేతనదారులు చేసే పనివేళలు, కొలతలు పారదర్శకంగా లెక్కించాలి. వేతనాలు రసీదులు కచ్చితంగా ఇవ్వాలి. పనులు చేపట్టే ప్రదేశంలో వేతనదారులకు ప్రథమ చికిత్స కిట్లతోపాటు తాగునీరు సదుపాయం కల్పించాలి. ప్రభుత్వం అందచేస్తున్న టెంట్లు తప్పనిసరిగా పనిచేసే చోట ఏర్పాటుచేయాలి.

బోగస్ మస్తర్లకు అడ్డుకట్ట

ఉపాధి పనుల్లో ఇప్పటికే బోగస్ మస్తర్ల బాగోతం నడుస్తోంది. వేతనదారులు పనికి రాకపోయినా హాజరైనట్టు కొందరు సిబ్బంది మస్తర్లు వేసి వేతనాలు స్వాహా చేసిన సందర్భాలు ఉన్నాయి. వేతన దినాలు దుర్వినియోగం కావడంతో పాటు పనులకు హాజరైన వేతనదారులకు పూర్తిగా వేతనం అందడం లేదు. అక్రమాలు అరికట్టడానికి జిల్లాస్థాయిలో పర్యవేక్షించే విజిలెన్స్ అధికారి సమన్వయం చేస్తారు. గత వైసీపీ పాలనలో పలు అక్రమాలు జరిగాయి. దీంతో కూటమి ప్రభుత్వం అమలులోకి వచ్చిన తరువాత అనేకచోట్ల అక్రమాలపై విజిలెన్స్ అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. అక్రమాలకు పాల్పడిన వారిని గుర్తించి వారినుంచి రకవరీ చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నారు.

శ్రమశక్తి సంఘాల పునరుద్ధరణ

గతంలో 20 నుంచి 30 మంది వేతనదారులతో శ్రమశక్తి సంఘాలు (ఎస్ఎస్ఎస్)గా 20 ఏర్పాటుచేసి వారికి మేట్‌లను నియమించేవారు. వారికి ఏటా శిక్షణ ఇచ్చేవారు. ఈసంఘాలు కొన్ని నిర్దిష్టమైన పనులు చేసేవి. మేట్‌లు అందరూ ఫీల్డ్ అసిస్టెంట్లకు సహాయంగా ఉండేవారు. దీంతో పథకం సజావుగా సాగేది. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో శ్రమశక్తి సంఘాలను పట్టించుకోకపోవడంతో కనుమరుగయ్యాయి. ఉపాధి హామీ పథకంలో పనులు సక్రమంగా జరగకపోవడానికి వేతనదారులకు రూ.300 అందడానికి సిబ్బందితో పాటు శ్రమశక్తి సంఘాలను తిరిగి అమలులోకి తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది. మండల స్థాయి సిబ్బందికి కూడా మారుతున్న కాలాన్ని బట్టి జాబ్ చార్ట్‌పై శిక్షణ, అవగాహన కల్పించనున్నారు.

లక్ష్యానికి అనుగుణంగా పనివేళలు



జాబ్ కార్డు ఉన్నవారందరికీ దినసరి వేతనం రూ.300 అందేలా చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా వేతనదారుల పనివేళలు పెంచాలి. రోజుకు నాలుగు గంటలు పనిచేసేవారు అదంగా మరో గంట చేస్తే కూలీ గిట్టుబాటు అవుతుంది. వేతన పెంపుపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని సిబ్బందిని ఆదేశించాం.

-డి.శ్రీలలిత, ఎంపీడీవో, పెద్దాపురం

కేశనపల్లిలో ఆవుల అందాల పోటీలు



కేశనపల్లిలో జరిగిన పోటీల్లో ఆవులు

మలికిపురం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం కేశనపల్లిలో రాష్ట్రస్థాయి ఒంగోలు, పుంగనూరు గిరి ఆవుల అందాల పోటీలు కొనసాగాయి. మొదటిరోజు సాయంత్రం పాల పోటీల్లో పాల్గొనే ఆవుల పాలను పూర్తిగా పితికించి మరుసటి రోజు శనివారం రెండు పూటల పాలను లెక్కించారు. అదేవిధంగా పలు విభాగాల పోటీల నిర్వహించారు. పుంగనూరు ఆవులు, గిత్తలు, ఒంగోలు ఆవులు, ఒంగోలు గిత్తలు, గిరి ఆవుల పోటీలను నిర్వహించారు. న్యాయ నిర్ణేతలు మొదటిరోజు వివరాలను సేకరించారు. పలు ప్రాంతాల నుంచి ఆవుల అందాల పోటీలను తిలకించడానికి భారీగా జనం వచ్చారు. అంబాజీపేటకు చెందిన వ్యక్తి తీసుకువచ్చిన చిన్న ఎడ్ల బండికి మేకను కట్టి ఒక బాలుడు ఆవరణలో హల్‌చల్ చేశాడు. శుక్రవారం రాత్రి రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్, అమలాపురం ఎంపీ హరీష్‌మాధుర్ ఆవుల అందాల పోటీలను తిలకించారు.





ప్రదర్శనలో ఆవులు.. చిన్న ఎడ్ల బండిలో కూర్చుని సందడి చేస్తున్న బాలుడు

నేటి నుంచి యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలు

తరలిరానున్న ఉపాధ్యాయులు

వేదిక పీఆర్ డిగ్రీ కళాశాల ప్రాంగణం

కలెక్టరేట్ (కాకినాడ), జనవరి 4(ఆంధ్రజ్యోతి): కాకినాడ పీఆర్ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఆదివారం నుంచి యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలు ప్రారంభం అవుతున్నాయి. 3రోజులపాటు ఈ సభలు జరగనున్నాయి. రాష్ట్రంలో 26జిల్లాల నుంచి వచ్చే వేలాది మంది ఉపాధ్యాయులు సభలో కుర్చునే విధంగా ఏర్పాట్లు చేశారు. ముఖ్య అతిథులు ఆశీనులయ్యే విధంగా ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. భారీగా టెంట్‌లు, సభా వేదిక నిర్మించారు. సభకు హాజరైన ఉపాధ్యాయులకు ప్రత్యేకంగా భోజనాలు, అల్పాహారాలు సమకూర్చుతున్నారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గం నుంచి జిల్లా కార్యవర్గం అందరూ దీనిలో తలమునకలై ఉన్నారు. ఈ సభను గ్రాండ్‌సక్సెస్ చేయాలనే సంకల్పంతో ఏర్పాట్లు చేస్తున్నారు.



మహాసభలకు చేస్తున్న ఏర్పాట్లు

మహిళా కానిస్టేబుల్ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు



మహిళా అభ్యర్థుల పరుగు పందాన్ని పర్యవేక్షిస్తున్న కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్

కాకినాడ క్రైం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): పోలీస్ కానిస్టేబుల్ నియామక ఎంపిక ప్రక్రియలో భాగంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా ప్రాథమిక రాతపరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థినులకు దేహదారుఢ్య పరీక్షలను కాకినాడ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలు ఐదో రోజైన శనివారం కూడా కొనసాగాయి. ఈ పరీక్షల్లో మొత్తం 320 మంది మహిళా అభ్యర్థినులు హాజరు కాగా తదుపరి పరీక్షకు 203 మంది అభ్యర్థినులు అర్హత సాధించారు. ఈ సామర్థ్య పరీక్షలను ఎస్పీ విక్రాంత్‌పాటిల్ స్వయంగా పర్యవేక్షించారు.

జేఎన్టీయూకే ప్రొఫెసర్లపై చర్యలకు ఆదేశాలివ్వాలి

గవర్నర్‌కు సోషల్ యాక్టివిస్ట్ ఫిర్యాదు

జేఎన్టీయూకే, జనవరి 4(ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్టీయూకేలో జరుగుతున్న పరిపాలన, ఆర్థిక అక్రమ లావాదేవీలపై మూడో పార్టీ ప్రత్యేక ఆడిట్ నిర్వహణతోపాటు కోట్లాది రూపాయిల దుర్వినియోగానికి కారకులైన ప్రొఫెసర్లపై చర్యలకు ఆదేశాలివ్వాలని కాకినాడకు చెందిన సోషల్ యాక్టివిస్ట్ ఏపీ గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు. విశ్వవిద్యాలయం ఏర్పాటైనప్పటి నుంచి నేటి వరకూ ఉన్న ఉపకులపతులు, రిజిస్ట్రార్లు, డైరెక్టర్లు తమ ఇష్టారాజ్యంగా నిధులను ఖర్చుచేశారని వారిపై విచారణ చేసి రికవరీ చేయాలని కోరారు. ఆడిట్ వర్గాలు అభ్యంతరాలు వ్యక్తంచేస్తున్నప్పటికీ డైరెక్టర్లకు పేషీ అలవెన్స్, కారు అలవెన్స్‌లను చెల్లిస్తున్నారన్నారు. అనుబంధ కళాశాలలు కొన్ని బకాయిపడిన ఫీజులను చెల్లించకపోయినా వాటికి అనుమతులు ఇస్తున్నారని తెలిపారు. త్వరలో భర్తీ కానున్న విశ్వవిద్యాలయ ఉపకులపతి పదవికి జేఎన్టీయూకే నుంచి చాలా మంది ప్రొఫెసర్లు పోటీపడుతున్నారని సచ్చీలురైన వారిని ఎంపికచేసి నియమించాలని కోరారు. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఉపకులపతి పదవిని భర్తీచేయడానికి ఏర్పాటుచేసిన ఆన్‌లైన్ విధానంలో 14వ నిబంధన క్రింద దరఖాస్తుదారుడిపై ఉన్న కోర్టు కేసులు, విజిలెన్స్ కేసుల ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించాల్సి ఉంటుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు ప్రతులను రాష్ట్రగవర్నర్‌తో పాటూ సీఎం నారా చంద్రబాబునాయుడు, విద్యాశాఖా మంత్రి నారా లోకేశ్‌కు పంపించారు.

బాలబాలాజీకి విశేష పూజలు

రూ.1,84,745 ఆదాయం

మామిడికుదురు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం అప్పనపల్లి బాలబాలాజీ స్వామివారికి శనివారం అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం దేవస్థానం భక్తులతో కిటకిటలాడింది. వేకువ జామున అర్చకులు వేద మంత్రోచ్చారణలతో స్వామివారికి తొలిహారతి ఇచ్చి సుప్రభాత సేవ నిర్వహించారు. నిత్య కల్యాణం, లక్ష్మీనారాయణ హోమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. స్వామివారిని శనివారం 3289 మంది భక్తులు దర్శించుకుని, 2316మంది అన్నదాన ప్రసాదం స్వీకరించారని, వివిధ ఆర్జిత సేవల ద్వారా రూ.1,84,745 ఆదాయం వచ్చినట్టు సహాయ కమిషనర్ ఎన్.సత్యనారాయణ తెలిపారు. భక్తులకు ఏవిధమైన ఇబ్బంది లేకుండా సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

శృంగారవల్లభస్వామి దర్శనానికి పోటెత్తిన భక్తులు

పెద్దాపురం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం మండలంలోని తిరుపతి శృంగారవల్లభస్వామి దర్శనానికి శనివారం తెల్లవారుజామునుంచే భక్తులు బారులు తీరారు. ప్రత్యేక దర్శన టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.73,150, అన్నదాన విరాళాలు రూ.38,813, కేశఖండన ద్వారా రూ.1,960, తులాభారం, కానుకలు ద్వారా రూ.300 లడ్డూ ప్రసాదం విక్రయం ద్వారా రూ.14,250 వెరసి రూ.1,28,743 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. సుమారు 4వేలమంది భక్తులు స్వామిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించినట్లు అధికారులు తెలిపారు. ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, నారాయణాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో ఆంకాలజీ ఐసీయూ ప్రారంభం



ఆంకాలజీ ఐసీయూను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు కొండబాబు, నానాజీ

జీజీహెచ్ (కాకినాడ), జనవరి 4(ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్ ఆంకాలజీ విభాగంలో రంగరాయ వైద్య కళాశాల పూర్వ విద్యార్థి డా.పేర్రాజు దినవాహి జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఐసీయూ)ను కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం వెంకటేశ్వరరావు (నానాజీ) శనివారం ప్రారంభించారు. తొలుత మెడిసిన్ విభాగంలో డయాలసిస్ యూనిట్‌కు సంబంధించిన ఆర్వోప్లాంట్‌ను వారు ప్రారంభించారు. అనంతరం రూ.10.62 లక్షల సీఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన పాలియేటివ్ ఆంకాలజీ యూనీట్, రేడియేషన్ ఆంకాలజీ యూనిట్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన ఆరు పడకల సామర్థ్యం కలిగిన ప్రత్యేక ఐసీయూను ఎమ్మెల్యేలు రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. 2001 బ్యాచ్‌కు చెందిన ఆర్ఎంసీ పూర్వ విద్యార్థి డా.పేర్రాజు దినవాహి జ్ఞాపకార్థం ఆయన తల్లిదండ్రులు చిన హనుమంతురావ్, పద్మావతి దంపతులు, 2001 ఆర్ఎంసీ పూర్వ విద్యార్థులు కలిసి అందజేసిన నిధుల సాయంతో ఈ ఐసీయూను ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యేలు మాట్లాడుతూ గోదావరి జిల్లాల ఆరోగ్య ప్రధాయిని అయిన కాకినాడ జీజీహెచ్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేసి జీజీహెచ్‌ను కార్పొరేట్‌కు దీటుగా వైద్య సేవలు అందించే విధంగా కృషి చేస్తామన్నారు. ప్రస్తుత సమాజంలో క్యాన్సర్ మహమ్మారి ఎక్కువ మందిని పట్టి పీడిస్తుందని ఈ పరిస్థితుల్లో క్యాన్సర్ విభాగాన్ని మరింత అభివృద్ధి పర్చవల్సి ఉందని, ప్రస్తుత ఐసీయూ క్యాన్సర్ పేషెంట్లకు ఎంతో దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో జీజీహెచ్ సూపరిండెంట్ డా.ఎస్.లావణ్యకుమారి, డిప్యూటీ సూపరిండెంట్, ఆంకాలజీ హెచ్‌వోడి డా.శ్రీనివాసన్, మెడిసిన్ హెచ్‌వోడి డా.యశోదమ్మ, రామ్‌కోసా అధ్యక్షుడు డా.ఆనంద్, కార్యదర్శి డా.అరుణాదిత్య, కోశాధికారి డా.తేజోకృష్ణ, టీడీపీ నాయకులు అమన్‌జైన్, మల్లిపూడి వీరు ఉన్నారు.

కాలేజీ బస్సు ఢీకొని కార్మికుడి మృతి

సర్పవరం జంక్షన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): బీచ్‌రోడ్డు కోరమండల్ రహదారిలో ఓ కాలేజీ బస్సు ఢీకొని కార్మికుడు మృతిచెందిన సంఘటన శుక్రవారం సాయంత్రం జరిగింది. వివరాల్లో కెళితే కాకినాడ రూరల్ వలసపాకలకు చెందిన నిమ్మ మణికంఠ (22) బీచ్‌రోడ్డులో గల కోరమండల్ ఇంటర్నేషనల్ సంస్థలో కాంట్రాక్టర్ వద్ద హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం కంపెనీలో పని ముగించుకుని కర్మాగారం బయట రహదారిపైకి రాగానే అటుగా వస్తున్న ఆదిత్య కాలేజీకి చెందిన బస్సు మణికంఠను ఢీకొంది. ఈ ఘటనలో తీవ్ర గాయాలతో అస్వస్థతకు గురైన క్షతగాత్రుడ్ని మెరుగైన చికిత్స కోసం జీజీహెచ్‌కు తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. మృతుడు బంధువు ఆర్.గురుమూర్తి ఫిర్యాదు మేరకు సర్పవరం ఎస్‌హెచ్‌వో బి.పెద్దిరాజు ఆదేశాల మేరకు ఏఎస్ఐ నాగేశ్వరరావు కేసు నమోదు చేశారు.



మణికంఠ (ఫైల్ ఫొటో)

కుటుంబానికి ఆధారంగా ఉన్న కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. త్వరలో ఇద్దరు చెల్లెళ్లకు పెళ్లి చేసేద్దాం అనుకుంటున్న క్రమంలో కుమారుడు మణికంఠ మృతి చెందడం పట్ల తల్లిదండ్రులు, సోదరిలు కన్నీరు మున్నీరుగా విలపించిన తీరు చూపరులను కంటతడి పెట్టించింది. ప్రమాదానికి కారణమైన బస్సు డ్రైవర్‌పై కుటుంబీకులు ఆందోళన వ్యక్తం చేశారు. మృతికి కారణమైన కాలేజీ యాజమాన్యం తగిన న్యాయం చేయాలని, లేదంటే మృతదేహంతో కాలేజీ ఎదుట ఆందోళన చేస్తామని బాధితులు హెచ్చరించారు. కాలేజీ యాజమాన్యం మృతుని బంధువులతో చర్చించి, తగిన హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి

ప్రత్తిపాడు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు జాతీయ రహదారిపై శుక్రవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతిచెందాడు. స్థానిక పోలీసులు అందించిన సమాచారం మేరకు రాజమహేంద్రవరం నుంచి తునికి బైక్‌పై వెళుతున్న తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం దేవరపల్లి గ్రామానికి చెందిన కర్రి సతీష్(25) స్థానిక నరేంద్రగిరి హై వేవద్దకు చేరుకోగానే గుర్తుతెలియని వాహనం ఢీకొని సతీష్‌మీదుగా దూసుకుపోయింది. దీంతో శరీర భాగాలు నుజ్జునుజ్జు అయి అక్కడికక్కడే మృతిచెందాడు. సంఘటనా స్థలాన్ని ప్రత్తిపాడు సీఐ బి.సూర్య అప్పారావు, ఎస్ఐ లక్ష్మీకాంతం పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించేందుకు గాలింపు చర్యలు చేపట్టారు.



ప్రత్తిపాడులో మృతిచెందిన సతీష్

మిలీషియా కమాండర్ లొంగుబాటు



పోలీసుల ఎదుట లొంగిపోయిన మిలీషియా కమాండర్ తెల్లం బుద్ర

చింతూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): చింతూరు పోలీసుల ఎదుట మావోయిస్టు పార్టీ మిలీషియా కమాండర్ తెల్లం బుద్ర శనివారం లొంగిపోయాడు. చింతూరు ఏఎస్పీ పంకజ్ కమార్ మీనా వివరాల మేరకు.. చత్తీస్‌గడ్‌లోని సుక్మా జిల్లా చిమిలిపెంటకు చెందిన తెల్లం బుద్ర 2010లో మావోయిస్టు పార్టీలో చేరాడు. దీంతో మిలీషియా సభ్యుడిగా మావోయిస్టు పార్టీ బాధ్యతలు అప్పగించింది. తదుపరి 2012లో మిలీషియా కమాండర్‌గా పదోన్నతి కల్పించిన పార్టీ 12 బోర్ తుపాకీ కేటాయించింది. నాటి నుంచి ఇప్పటివరకు సూర్పనగూడ మిలీషియా కమాండర్‌గా పని చేసిన బుద్ర మావోయిస్టు పార్టీ విధానాలకు విసుగు చెంది తమ ఎదుట లొంగి పోయినట్టు ఏఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ కంపెనీ 42వ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ పి.దివాకర్, సీఐ దుర్గాప్రసాద్, ఎస్ఐ పిరమేష్ పాల్గొన్నారు.

'సూపర్-6 అమలులో ప్రభుత్వం వైఫల్యం'

అమలాపురం టౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): సూపర్-6 హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీడబ్ల్యూసీ సభ్యుడు గిడుగు రుద్రరాజు ఆరోపించారు. ఎన్నో ఆశలతో ప్రజలు కూటమి ప్రభుత్వానికి అవకాశం కల్పిస్తే 6నెలల్లోనే చేయాల్సిందంతా చేస్తున్నారని ధ్వజమెత్తారు. విశాఖ స్టీలు ప్లాంటును ప్రైవేటీకరణ కాకుండా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ ఏం ప్రయత్నాలు చేస్తున్నారో ప్రజలకు బహిరంగంగా చెప్పాలన్నారు. తొలుత అమలాపురంలోని గిడుగు స్వగృహం వద్ద నూతన సంవత్సర వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కొండేటి చిట్టిబాబు, నియోజకవర్గ ప్రతినిధి అయితాబత్తుల సుభాషిణి, చీకట్ల అబ్బాయి, వంటెద్దు బాబి, అయితాబత్తుల కుమార్‌సింగ్ ఉన్నారు.

సంక్రాంతికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు



కార్పొరేషన్(కాకినాడ), జనవరి 4(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా కాకినాడ జిల్లా నుంచి ప్రత్యేక బస్సులు తిప్పేందుకు ఆర్టీసీ అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఈనెల 8 నుంచి 13వతేదీ వరకు దూర ప్రాంతాలకు బస్సులను సిద్ధం చేస్తున్నామని జిల్లా ప్రజా రవాణాధికారి ఎం.శ్రీనివాసరావు తెలిపారు.

హైదరాబాద్ రూటులో అధికంగా..

హైదరాబాద్ నుంచి తెలుగు రాష్ట్రాలకు సంక్రాంతి పండుగ సందర్భంగా వచ్చే ప్రయాణికులను దృష్టిలో పెట్టుకుని హైదరాబాద్ నుంచి కాకినాడ జిల్లాకు 66 బస్సులు నడిపేందుకు ఆర్టీసీ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. వీటిలో హైదరాబాద్ నుంచి కాకినాడ డిపోకు 34 బస్సులు, హైదరాబాద్ నుంచి పార్వతీపురం ఒక బస్సు, హైదరాబాద్ నుంచి తుని డిపోకు 18 బస్సులు, హైదరాబాద్ నుంచి ఏలేశ్వరం డిపోకు 13 బస్సులు సంక్రాంతి పండుగ సందర్భంగా తిప్పనున్నారు. డిమాండ్‌ను బట్టి బస్సుల సంఖ్య పెంచేందుకు సిద్ధంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. అలాగే ఇతర జిల్లాలకు కూడా బస్సులు నడిపేందుకు ఏర్పాటు చేశారు. కాకినాడ నుంచి విశాఖపట్నం 10 బస్సులు, కాకినాడ నుంచి పలాస ఒక బస్సు, కాకినాడ నుంచి శ్రీకాకుళం మూడు బస్సులు, కాకినాడ నుంచి విజయనగరం మూడు బస్సులు కాకుండా రద్దీ బట్టి బస్సులు ఏర్పాటుచేయనున్నారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

వాకలపూడిలో గ్రామసభ

సర్పవరం జంక్షన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): వాకలపూడి పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామ కార్యదర్శి పిడుగు పాండురంగారావు అధ్యక్షతన చట్టబద్ధ గ్రామసభ నిర్వహించారు. ప్రజల నుంచి సమస్యల పరిష్కారం, చేపట్టబోయే అభివృద్ధి పనులపై సభ్యులతో చర్చించారు. ఈవోపీఆర్డీ, గ్రామ ప్రత్యేకాధికారి ఎంఎస్ఆర్ ఆంజనేయులు పాల్గొన్నారు.

చేనేత వస్త్ర ప్రదర్శన ప్రారంభం



చేనేత వస్త్ర ప్రదర్శన ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్సీ

కార్పొరేషన్ (కాకినాడ), జనవరి 4(ఆంధ్రజ్యోతి): కాకినాడ ఎస్ఆర్ఎంటీ ఫంక్షన్‌లో రాష్ట్ర చేనేత, జౌళి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చేనేత వస్త్ర ప్రదర్శన, అమ్మకం, 2025 కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, రాష్ట్ర పౌర సరఫరా సంస్థ ఛైర్మన్ తోట సుధీర్ ప్రారంభించారు. వివిధ రాష్ట్రాలతో పాటు ఏపీలోని ప్రసిద్ధి ప్రాంతాల నుంచి స్టాల్స్‌లో ప్రదర్శించిన చేనేత ఉత్పత్తులను వారు పరిశీలించి వస్త్రాల వివరాలు తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేనేత ఉత్పత్తులు మార్కెటింగ్, ప్రచారం కల్పించే ఉద్దేశంతో ఆంధ్రప్రదేశ్ చేనేత, జౌళి శాఖ ఆధ్వర్యంలో కాకినాడలో చేనేత వస్త్ర ప్రదర్శన, అమ్మకాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ ప్రదర్శనలు రాష్ట్రంలో ప్రసిద్ధి గాంచిన వివిధ జిల్లాల చేనేత,పట్టు వస్త్రాలతో పాటు తెలంగాణ, ఉత్తర ప్రదేశ్, జమ్మూకాశ్మీర్, బీహార్, పశ్చిమబెంగాల్ రాష్ట్రాలకు చెందిన వస్త్రాలు, హస్తకళల ఉత్పత్తులతో కూడిన 85 స్టాల్స్ ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో చేనేత జౌళి శాఖ జాయింట్ డైరెక్టర్ కె.కన్నబాబు, ఆర్‌జేడి బి.ధనుంజయరావు, అసిస్టెంట్ డైరెక్టర్ సాయిబాబా, జిల్లా చేనేత జౌళి శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కె.పెద్దరాజు తదితరులు పాల్గొన్నారు.

రూ.10 కోట్లతో సీసీ రోడ్లు : చినరాజప్ప

సామర్లకోట, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో పల్లెపండుగ పేరిట గ్రామీణ రహదారులను సిమెంట్ రోడ్లుగా సుందరంగా తీర్చిదిద్దేందుకు పుష్కలంగా నిధులు విడుదలచేయడంతో ఇప్పటికే రూ. పది కోట్ల వ్యయంతో పెద్దాపురం నియోజకవర్గంలో పలు గ్రామాల్లో సీసీ రోడ్లు నిర్మించామని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పేర్కొన్నారు. సామర్లకోట మండలం పి.వేమవరంలో ఉపాధి హామీ నిధులు రూ.25 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే శనివారం కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. రాజప్ప మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా రెండవ దశలో 26 సీసీరోడ్ల పనులకు రూ.4.13 కోట్ల నిధులు విడుదల అయ్యాయని, వాటిలో సామర్లకోట మండలంలో 13 సీసీ రోడ్ల నిమిత్తం రూ.2.13 కోట్లు, పెద్దాపురం మండలానికి 13 సీసీ రోడ్ల నిమిత్తం రూ.2 కోట్లు నిధులు విడుదల అయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో పాలకుర్తి శ్రీనుబాబు, తోటకూర శ్రీనువాసు, ముసిరెడ్డి శ్రీరాములు, రాంబాబు పాల్గొన్నారు.

ఓపెన్ జిమ్ ప్రారంభం

సామర్లకోట నీలమ్మ చెరువు గట్టు వద్ద మున్సిపాల్టీ ఆధ్వర్యంలో రూ.10 లక్షలతో ఏర్పాటుచేసిన ఓపెన్ జిమ్‌ను ఎమ్మెల్యే చినరాజప్ప కుడా ఛైర్మన్ తుమ్మల బాబుతో కలిసి ప్రారంభించారు. మున్సిపల్ కమిషనర్ శ్రీవిద్య, మున్సిపల్ ఛైర్‌పర్సన్ జీ.అరుణ, వైస్ ఛైర్‌పర్సన్ గోకిన సునేత్రాదేవి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

‘శివారు ప్రాంతాలకు సాగునీరందిస్తాం’

గొల్లప్రోలు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ఏలేరు, పీబీసీ ఆయకట్టులోని శివారు ప్రాంతాలు అన్నింటికి సాగునీరు అందేలా చర్యలు తీసుకుంటామని ఇరిగేషన్ డీఈఈ రవికుమార్ తెలిపారు. గొల్లప్రోలులో సుద్దగడ్డ కాలువ దిగువ పంటపొలాలు సాగునీరు అందక రైతులు పడుతున్న ఇబ్బందులపై జనసేన నాయకుడు కడారి తమ్మయ్యనాయుడు తదితరులు పిఠాపురం ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై మర్రెడ్డి ఇరిగేషన్ ఉన్నతాధికారులతో మాట్లాడారు. ఈ నేపథ్యంలో డీఈఈ రవికుమార్, ఏఈఈ ప్రసన్నకుమార్ పంటపొలాలు, పంట కాలువలను శనివారం పరిశీలించారు. కాలువల ద్వారా సాగునీటి విడుదలను పెంచి నీరు అందేలా చూస్తామని వారు తెలిపారు. వారి వెంట పీబీసీ డిస్ట్రిబ్యూటరీ కమిటీ వైస్‌ఛైర్మన్ దువ్వ కొండలరావు, జనసేన నాయకుడు కడారి తమ్మయ్యనాయుడు తదితరులు ఉన్నారు.

విజిలెన్స్ అధికారుల తనిఖీలు

సర్పవరం జంక్షన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): పేదల ఇళ్ల స్థలాల కోసం సేకరించి, పట్టాలు ఇచ్చిన జగనన్న లే అవుట్లలో శనివారం విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేపట్టారు. విజిలెన్స్ ఎస్పీ ఆదేశాల మేరకు డీఎస్పీ ఆధ్వర్యంలో రెవెన్యూ, హౌసింగ్ అధికారులు, సిబ్బందితో కలసి కాకినాడ రూరల్ మండలం తిమ్మాపురం, నేమాం, పండూరులో ఉన్న లేఅవుట్లను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. లేఅవుట్లలో జరిగిన అక్రమాలపై నిగ్గుతేల్చేందుకు అధికారుల విచారణ జరుగుతున్నట్టు ప్రచారం సాగుతోంది.

రోడ్డంతా గొయ్యిలే..

అధ్వానంగా ఉప్పాడ- కాకినాడ బీచ్‌రోడ్డు

విసుగెత్తిపోతున్న ప్రయాణికులు



ఉప్పాడ బీచ్‌రోడ్డు దుస్థితి దృశ్యాలు



కొత్తపల్లి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఉప్పాడ నుంచి కాకినాడ వెళ్లే బీచ్‌రోడ్డు గొయ్యిలతో అధ్వానంగా మారింది. వైసీపీ ప్రభుత్వంలో జగన్మోహన్‌రెడ్డి కొమరగిరి మెగా లేఅవుట్లో పేదల ఇళ్ల పట్టాల పంపిణీకి వచ్చిన సందర్భంలో కేవలం మరమ్మతులు చేశారు. అప్పటి నుంచి సుమారు 5 ఏళ్లలో బీచ్‌రోడ్డులో ఎటువంటి మరమ్మతుల చేపట్టకపోవడంతో పూర్తిగా గోతులమయంగా మారింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గతుకులు, గోతులతో ఉన్న ఆర్అండ్‌బీ రహదారులకు మరమ్మతుల చర్యలు చేపడతారని ప్రయాణికులు ఎదురుచూస్తున్నారు. ఉప్పాడ నుంచి బీచ్‌రోడ్డు మీదుగా కాకినాడ వెళ్లే దారిలో అగాధాల్లాంటి గోతులు ఏర్పడ్డాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బీచ్‌రోడ్డులో రాత్రిపూట బైక్‌పై ప్రయాణం చేసే వ్యక్తులు ఎదురుగా ఏదైనా వాహనం వస్తే గోతుల్లో పడి గాయాలపాలవుతున్నారు. ఉప్పాడ నుంచి నేమాం వరకు బీచ్‌రోడ్డులో సుమారు 5 నుంచి 10 సెంటీమీటర్ల గోతులు ఏర్పడ్డాయి. ఆయా గోతుల్లో గ్రావెల్ వేసి మరమ్మతులు చేపట్టకపోవడం పట్ల ప్రయాణికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖాధికారులు స్పందించి బీచ్‌రోడ్డులో మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

దేశ, రాష్ట్ర భవిష్యత్తుకు తరగతి గదిలోనే పునాది

కాకినాడ సిటీ ఎమ్మెల్యే కొండబాబు



కాకినాడలో భోజనాలు వడ్డిస్తున్న ఎమ్మెల్యే కొండబాబు



గొల్లప్రోలులో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న మర్రెడ్డి

కాకినాడ సిటీ, జనవరి 4(ఆంధ్రజ్యోతి): అనేక మందికి అన్నం పెట్టి ఆకలితీర్చిన అన్నపూర్ణమ్మ డొక్కా సీతమ్మ అని.. దేశ, రాష్ట్ర భవిష్యత్తుకు తరగతి గదిలోనే పునాది ఏర్పడుతుందని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకం కార్యక్రమాన్ని శనివారం పీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, పీఆర్ వృత్తి విద్య జూనియర్ కళాశాల, ఏఎస్‌డీ మహిళా జూనియర్ కళాశాలలో విద్యార్థులకు భోజనాలు వడ్డించి ప్రారంభించి వారితో ఎమ్మెల్యే కలిసి భోజనం చేశారు. అర్బన్ తహశీల్దార్ వి జితేంద్ర, కళాశాలల ప్రిన్సిపాల్స్ డాక్టర్ జ్యోతుల రాంబాబు, మావూరి తిరుపతిరెడ్డి, సీహెచ్ నారాయణమూర్తిరాజు, టీడీపీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, నాయకులు ఎంఏ తాజుద్దీన్, బొబ్బిలి గోవిందు, చింతలపూడి రవి, రెడ్సం సత్తిబాబు, గోపిశెట్టి బూరయ్య పాల్గొన్నారు.

విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తే లక్ష్యం

గొల్లప్రోలు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఉజ్వలమైన భవిష్యత్తు కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని జనసేన పిఠాపురం ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు తెలిపారు. గొల్లప్రోలు ప్రభుత్వ జూనియర్‌కళాశాలలో ఇంటర్ విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన శనివారం ప్రారంభించారు. అనంతరం విద్యార్థులతో కలిసి కూర్చొని భోజనం చేశారు. జనసేన నేతలు కడారి తమ్మయ్యనాయుడు, బస్సా చిట్టిబాబు, బలిరెడ్డి గంగబాబు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గుండ్ర సుబ్బారావు, కళాశాల ప్రిన్సిపాల్ నేతిపూడి గోవిందు ఉన్నారు.

హామీ నెరవేర్చిన లోకేశ్

యువగళం పాదయాత్ర సందర్భంగా ఇంటర్ విద్యార్థులు తన దృష్టికి తీసుకువచ్చిన మధ్యాహ్న భోజన పథకం సమస్యను ఇచ్చిన హామీకి అనుగుణంగా అధికారంలో వచ్చిన తర్వాత మంత్రి నారా లోకేశ్ నెరవేర్చారని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ తెలిపారు. విశాఖలో ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు పర్యటన స్థలాల పరిశీలనలో ఉండడంతో తాను ఈ కార్యక్రమానికి హాజరుకాలేకపోయానన్నారు.

పిఠాపురం: పట్టణంలోని జగ్గయ్యచెరువు కాలనీలో గల బాదం మాధవరావు ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల ప్లస్ జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని శనివారం విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ నాగమణి ప్రారంభించారు. విద్యార్థులు భోజనాలు వడ్డించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జి.శ్యాంబాబు, అధ్యాపకులు కసా రమణమూర్తి, లీలాబేబీ, సత్యవేణి పాల్గొన్నారు. పట్టణంలోని ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని జనసేన పిఠాపురం ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు ప్రారంభించారు.

గొల్లప్రోలు కమిషనర్‌గా కనకారావు



బాధ్యతలు స్వీకరిస్తున్న కనకారావు

గొల్లప్రోలు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు నగరపంచాయతీ కమిషనర్‌గా నామా కనకారావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకూ కమిషనర్‌గా పనిచేసిన టి.రవికుమార్ పదవీ విరమణ చేశారు. దీంతో ఇప్పటి వరకూ డెలిగేట్ కమిషనర్‌గా ఏఈ ప్రభాకర్ బాధ్యతలు నిర్వహించారు. తాజాగా పిఠాపురం మున్సిపల్ కమిషనర్‌గా ఉన్న కనకారావుకు గొల్లప్రోలు కమిషనర్‌గా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ ఎం.హరినారాయణన్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆయన బాధ్యతలు చేపట్టారు. నగరపంచాయతీలో జరుగుతున్న కార్యక్రమాలపై ఆయా విభాగాధిపతులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ప్రజల సమస్యలను సత్వరం పరిష్కరించే దిశగా అందరూ పనిచేయాలని ఆదేశించారు.

టీపీఎస్‌గా ఉమామహేశ్వరరావు

గొల్లప్రోలు నగరపంచాయతీ టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్‌గా ఉమామహేశ్వరరావు బాధ్యతలు చేపట్టారు. పట్టణ ప్రణాళికా విభాగంలో రెగ్యులర్ ఉద్యోగులు లేకపోవడంతో ప్లాన్ అప్రూవల్స్, ఇతర కార్యకలాపాల నిర్వహణలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో పిఠాపురం మున్సిపల్ కార్యాలయంలో టీపీఎస్‌గా పనిచేస్తున్న ఉమా మహేశ్వరరావు గొల్లప్రోలు టీపీఎస్ ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీఅయ్యాయి.

గోకులం షెడ్లు పూర్తి చేయాలి

గొల్లప్రోలు రూరల్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా గోకులం షెడ్లు, సీసీ రోడ్లు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని డ్వామా పీడీ వెంకటలక్ష్మి సూచించారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలు, చెందుర్తి, తాటిపర్తి, చినజగ్గంపేట, వన్నెపూడి, కొడవలి, దుర్గాడ గ్రామాల్లో ఆమె పర్యటించి రోడ్లు, గోకులం షెడ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. ఏపీవో కొండలరావు తదితరులు ఉన్నారు.

ఎస్పీ పూజలు

ద్రాక్షారామ, జనవరి4(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ భీమేశ్వరాలయాన్ని కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్ శనివారం సతీసమేతంగా సందర్శించారు. భీమేశ్వరస్వామి,మాణిక్యాంబ అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. దర్శన అనంతరం నందిమండపంలో వేదపండితుల ఆశీర్వచనం అందుకున్నారు.



లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలు



కరప భవిత కేంద్రంలో లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుక నిర్వహిస్తున్న దృశ్యం

సామర్లకోట, జనవరి4(ఆంధ్రజ్యోతి): బ్రెయిలీ లిపీ విద్యా అభ్యున్నతికి తోడ్పడుతుందని కాకినాడ డివిజన్ డీవైఈవో వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. సామర్లకోట ఎంఈవో పట్టపగలు పుల్లయ్య అధ్యక్షతన లూయిస్ బ్రెయిలీ 216వ జయంతి కార్యక్రమం శనివారం సామర్లకోట పట్టణ పరిధిల భవిత విద్యా కేంద్రంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో వై.శివరామకృష్ణయ్య, భవిత విద్యాకేంద్ర సిబ్బంది అనిత, పద్మ, దివ్యాంగ విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే నవర జడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్ ఎం సీహెచ్.సత్యవతి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ముందుగా లూయిస్ బ్రెయిలీ చిత్రపటానికి ఎంఈవో పుల్లయ్య పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉమామనో వికాస కేంద్రంలో

సర్పవరం జంక్షన్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): వాకలపూడి ఉమా ఎడ్యుకేషనల్ అండ్ టెక్నికల్ సొసైటీలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్‌పి రెడ్డి ఆధ్వర్యంలో శనివారం లూయిస్ బ్రెయిలీ 216వ జయంతి వేడుకలు విభిన్న ప్రతిభావంతులు, బధిర అంధత్వం విద్యార్థుల ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రెడ్డి మాట్లాడుతూ అంధుల పాలిట ఆశాదీపం బ్రెయిలీ అన్నారు. జనవరి 4న పారిస్ క్రూవేలో జన్మించిన బ్రెయిలీ బాల్యంలో ప్రమాదశాత్తురెండు కళ్లను కోల్పోయి 4వ ఏటా పూర్తిగా అంధుడిగా మారాడన్నారు. ఈసందర్భంగా నిర్వహించిన ఆటల పోటీల్లో రాణించిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ కె.నారాయణ రెడ్డి, సత్యనారాయణరెడ్డి, ఎస్.ఉ మారెడ్డి, ఎస్‌ఏ నాయుడు, టి.హరిబాబు పాల్గొన్నారు.

లూయిస్ బ్రెయిలీకి నివాళి

పిఠాపురం, జనవరి 4(ఆంధ్రజ్యోతి): పిఠాపురం పట్టణంలోని భవిత కేంద్రంలో లూయిస్ బ్రెయిలీ 126వ జయంతిని శనివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ఎంఈవోలు జి.శ్యాంబాబు, నారాయణదాసు, ఓబీఎస్ మునిసిపల్ ఉన్నత పాఠశాల హెచ్ఎం రమేష్‌లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దృష్టిలోపం కలిగిన విద్యార్థులకు సమగ్రశిక్ష అందిస్తున్న సదుపాయాలు, పథకాలు గురించి వివరించారు. కార్యక్రమంలో భవిత ఐఈఆర్పీలు బండి రాజ్‌కుమార్, ప్రసూన, పి.సత్యమోహన రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంధుల కంటి వెలుగు బ్రెయిలీ

కరప, జనవరి 4(ఆంధ్రజ్యోతి): అంధుల కోసం ప్రత్యేక లిపిని ఆవిష్కరించి వారి జీవితాల్లో వెలుగులు నింపిన మహోన్నతుడు లూయిస్ బ్రెయిలీ అని ఎంఈవో-2 పత్తి సత్యనారాయణ కొనియాడారు. కరప భవిత కేంద్రంలో శనివారం లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకల్లో ఎంఈవో పాల్గొని అంధుల కోసం ఆయన చేసిన సేవలను వివరించారు. ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల సమక్షంలో బ్రెయిలీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్‌చేసి చిన్నారులకు పంచిపెట్టారు. ఐఈఆర్‌టీ స్వాతి, తదితరులు పాల్గొన్నారు.

దేశం భవిష్యత్ విద్యా కేంద్రంగా అవతరించనుంది

జేఎన్టీయూకే, జనవరి 4(ఆంధ్రజ్యోతి): భారతదేశం భవిష్యత్ విద్యాకేంద్రంగా అవతరించనుందని జేఎన్టీయూకే ఇన్‌చార్జి ఉపకులపతి కేవీఎస్‌జీ మురళీకృష్ణ అన్నారు. వర్సిటీలోని అలూమ్నీ ఆడిటోరియంలో మొదటి సంవత్సరం ఎం.ఫార్మసీ, బీఫార్మసీ విద్యార్థులకు స్కూల్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్, టెక్నాలజీస్ డైరెక్టరేట్ ఆధ్వర్యంలో శనివారం ఇండక్షన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వీసీ ముఖ్యఅతిథిగా, ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ వి.రవీంద్రనాద్, స్కూల్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ ఇన్‌చార్జి డైరెక్టర్ కె.పద్మప్రియ, కాకినాడ జిల్లా డ్రగ్ కంట్రోల్ అధికారి బి.శ్రీనివాసరావు గౌరవ అతిథులుగా పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన చేసి వీసీ, అతిథులు కార్యక్రమాన్ని ప్రారంభించారు. వీసీ మాట్లాడుతూ నూతన ఆవిష్కరణలతో కొత్త ఔషధాల అభివృద్ధి, ఉత్పత్తికి నెలవైన ఫార్మా రంగంలో అవకాశాలకు కొదవలేదన్నారు. ఫార్మసీ విభాగ అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దాట్ల పరామర్శ

కరప, జనవరి 4(ఆంధ్రజ్యోతి): మాతృవియోగంతో బాధపడుతున్న అన్నవరం పాలక మండలి మాజీ సభ్యుడు చాగంటి సూరిబాబును శనివారం ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు పరామర్శించారు. సూరిబాబు మాతృమూర్తి ప్రభావతి చిత్రపటానికి నివాళులర్పించారు. మాజీ మంత్రి కురసాల కన్నబాబు, వైసీపీ నాయకులు కూడా సూరిబాబును పరామర్శించి సంతాపం తెలిపారు.

సౌండ్ సిస్టం సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా నడికట్ల

కార్పొరేషన్(కాకినాడ), జనవరి 4(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సౌండ్ సిస్టమ్ ఓనర్లు, హెల్పర్ల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఏర్పడింది.శనివారం కాకినాడ నగరంలో రెవెన్యూ కాలనీలో గల శెట్టిబలిజ సంక్షేమ సంఘ స్థలంలో కాకినాడ జిల్లా సౌండ్ సిస్టమ్ ఓనర్లు, హెల్పర్లు సంక్షేమ సంఘం సమావేశం జరిగింది. సమావేశంలో సౌండ్ సిస్టమ్ ఓనర్లు, హెల్పర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై జిల్లా నలుమూలల నుంచి విచ్చేసిన సభ్యులు చర్చించారు. నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నడికట్ల లోవరాజు, ఉపా. ధ్యక్షులుగా పెంకే మారయ్య, వడ్డి రాజు, ఇందన బాల, మల్లాడి సత్తిబాబు, రెడ్డి మల్లికార్జునరావు, మేడిశెట్టి నాగేశ్వరరావు, సెక్రటరీగా కుక్కల గణిరాజు, జాయింట్ సెక్రటరీగా వల్లూరి కిరణ్ కుమార్, కోశాధికారిగా డింగ్ రాజు, జాయింట్ ట్రజరర్‌గా దుత్తూరి శ్రీమల ఎన్నికయ్యారు.

కొప్పులవెలమ సంఘీయుల సంక్షేమానికి కృషి

కాకినాడ సిటీ, జనవరి 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా 25లక్షల మంది కొప్పులవెలమ సంఘీయుల సంక్షేమానికి, అభివృద్ధికి కృషి చేస్తానని రాష్ట్ర కొప్పులవెలమ కార్పొరేషన్ ఛైర్మన్ పోలిపర్తి వెంకట గణేష్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం కాకినాడ ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో కొప్పులవెలమ సంఘీయుల ఆత్మీయ సమావేశం జరిగింది. సమావేశానికి సంఘం రాష్ట్ర నాయకుడు మాకిరెడ్డి భాస్కర్ గణేష్‌బాబు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా కార్పొరేషన్ రాష్ట్ర ఛైర్మన్ గణేష్‌కుమార్, విశిష్ట అతిథులుగా కార్పొరేషన్ డైరెక్టర్లు బర్ల అప్పారావు, పైల సాంబశివరావు, గౌరవ అతిథులుగా వెలమ ఫౌండేషన్ ఛైర్మన్ మూర్తి, వైఎస్ఎన్ మాస్టారు పాల్గొన్నారు. అనంతరం మీడియా సమావేశంలో రాష్ట్ర ఛైర్మన్ మాట్లాడుతూ కొప్పుల వెలమల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. గణేష్‌బాబు మాట్లాడుతూ జిల్లాలో ఏడు నియోజకవర్గాల్లో తుని నియోజకవర్గంలో కొప్పులవెలమలు ఎక్కువగా ఉన్నందున ఈస్థానాన్ని కొప్పులవెలమ కులస్తులకు కేటాయించాలని కోరారు. సమావేశంలో రాజానరాజు, తాయి నగేష్, ఏటుకూరి నాగమణి, పిల్లారిశెట్టి రాజేశ్వరి, కోకా కృష్ణారావు, బొబ్బిలి గోవిందు, రొంగల అప్పాజీ, బీసీ నాయకులు చొల్లంగి వేణుగోపాల్, వనపర్తి బద్రి, ఆవుపాటి ఉమాశంకర్, ఏవీడీ మెంటారావు పాల్గొన్నారు.

ఆర్ఎంసీలో జిమ్ ఏర్పాటు

జీజీహెచ్(కాకినాడ), జనవరి 4(ఆంధ్రజ్యోతి): కాకినాడ రంగరాయ వైద్య కళాశాల (ఆర్ఎంసీ)లో వైద్య విద్యార్థుల దేహదారుఢ్యత కోసం జిమ్‌ను ఏర్పాటు చేశారు. ఆ జిమ్‌ను ఆర్ఎంసీ ప్రిన్సిపాల్, డీఎంఈ, ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వీసీ డా. డి.ఎస్.వి.ఎల్.నరసింహం శనివారం ప్రారంభించారు. రూ.2.5లక్షలతో జిమ్ పరికరాలను కొనుగోలు చేసారు.

‘మేనరిక వివాహాలు మానండి’

కొత్తపల్లి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ఆస్తులు వేరేకొరికి పోతాయన్న ఆశతో పెద్దలు చేసే మేనరిక వివాహాలను విరమించి, ముందు తరాలకు మార్గదర్శకులు కావాలని జబర్దస్త్ రమణబాబు బృందం ప్రదర్శించిన బుర్రకథ గ్రామస్థులను చైతన్యవంతులను చేసింది. నాగులాపల్లి ప్రాథమిక వైద్యఆరోగ్యకేంద్రం (పీహెచ్‌సీ) ఆధ్వర్యంలో శ్రీరాంపురం, కోనపాపపేట గ్రామాల్లో మేనరిక వివాహాలు చేయడం వల్ల పుట్టే పిల్లలు అంగవైకల్యం, గ్రహణంమొర్రు, పిల్లల్లో ఎదుగుదల లేకపోవడం, మాట్లాడలేకపోవడం వంటి నష్టాలను బుర్రకథ ద్వారా వివరించారు. సర్పంచ్ రావి రమేష్, పిహెచ్‌పీ వైద్యురాలు సౌజన్య, ఆరోగ్యసిబ్బంది, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

కాకినాడ పోర్టు పరిరక్షణ సమితి ఆవిర్భావం

కాకినాడ సిటీ, జనవరి 4(ఆంధ్రజ్యోతి): కాకినాడ పోర్టు కార్మికులు ఉపాధి కోల్పోకుండా, పోర్టు ద్వారా వ్యాపార కార్యకలాపాలు దెబ్బతినకుండా, పోర్టు ప్రతిష్టను కాపాడుకోవడమే ధ్యేయంగా నగరంలోని ప్రజాసంఘాలు, అఖిలపక్ష రాజకీయ పార్టీలు, ఉద్యమ సంఘాలు, ఆలోచనాపరులు, నగరపౌరులతో కాకినాడ పోర్టు పరిరక్షణ సమితి ఆవిర్భవించింది. శనివారం కుంభాభిషేకం రేవు వద్ద ఏర్పాటుచేసిన సమావేశానికి నిర్వాహకులుగా ప్రజాసంఘాల ప్రతినిధి పప్పు దుర్గా రమేష్, ఆర్‌సీపీఐ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రంబాల సతీష్, జై భీమ్ భారత్‌రావు, పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారపు మల్లికార్జున, ఆర్‌పీఐ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పిట్టా వరప్రసాద్ వ్యవహరించారు. కాకినాడ పోర్టు ద్వారా వ్యాపార కార్యకలాపాలు మరింత పెరిగి, కార్మికుల ఉపాధి పెరిగేలా అందరి సహకారంతో పరిరక్షణ సమితి పనిచేస్తోందని నాయకులు తెలిపారు. తదుపరి సమావేశంలో భవిష్యత్ కార్యాచరణ ప్రకటించాలని నిర్ణయించారు. ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షుడు నరాల శివ, కృష్ణమోహన్, ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా మాజీ అధ్యక్షుడు కె.సతీష్, బడే గోవిందరావు, ఎన్‌జీవో సంఘాల అధ్యక్షుడు కాశరపు సింహాద్రి గుడిమెట్ల వీర్రాజు పాల్గొన్నారు.

వలంటీర్ల రెండో రోజు దీక్ష

కలెక్టరేట్(కాకినాడ), జనవరి 4(ఆంధ్రజ్యోతి): ఏపీ గ్రామవార్డు వలంటీర్ల సంఘం ఆధ్వర్యంలో కాకినాడ కలెక్టరేట్ వద్ద చేస్తున్న దీక్షలు రెండో రోజు శిబిరాన్ని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దువ్వ శేషుబాబ్జి ప్రారంభించారు. ఈనెల27న విజయవాడలో జరిగే రాష్ట్ర సదస్సుకు అధిక సంఖ్యలో వలంటీర్లు హాజరై జయప్రదం చేయాలన్నారు.

యార్డు స్థలాన్ని శ్మశానవాటికకు కేటాయించాలి

గొల్లప్రోలు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు పట్టణంలో మండలపరిషత్ కార్యాలయం, పీహెచ్‌సీల చెంతన ప్రస్తుతం ఉన్న డంపింగ్ యార్డు స్థలాన్ని శ్మశానవాటికకు కేటాయించాలని ఎస్సీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గొల్లప్రోలు పట్టణంలోని అరుందతీయపేట వద్ద ఎస్సీల మాల, మాదిగ సంఘాల సమావేశం శనివారం సాయంత్రం జరిగింది. ఏడాదిలోగా డంపింగ్‌యార్డుకు స్థల సేకరణ పూర్తి చేసి అక్కడకు తరలిస్తామని ఆర్డీవో తెలిపినందున తరలింపు జరిగిన తర్వాత ఆ స్థలాన్ని ఎస్సీల శ్మశానవాటికకే అప్పగించాలని వారు కోరారు. ప్రభుత్వం ఒప్పుకోకుంటే హైవేల దిగ్బంధనం, వంటా వార్పు, జాతీయరహదారిపై రాత్రి నిద్ర తదితర కార్యక్రమాల ద్వారా అందోళన నిర్వహిస్తామని వారు స్పష్టం చేశారు. ఎస్సీ సంఘాల నాయకులు ఈరుగుల పెద్దఏసు, నేకూరి ప్రసాద్, ఎం. డేవిడ్‌రాజు, తాతపూడి సాల్మన్‌రాజు, బెందుకుర్తి సత్తిబాబు, డొమ్మేటి మనోహర్, నగరపంచాయతీ వైస్‌చైర్మన్ గంధం నాగేశ్వరరావు, లింగంరాజు, సంఘ పెద్దలు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్స్ సంక్షేమ వేదిక అధ్యక్షుడిగా దొరబాబు



డీలర్స్ సంక్షేమ వేదిక కార్యవర్గం ఎన్నిక

కాకినాడ సిటీ, జనవరి 4(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా రేషన్ డీలర్స్ సంక్షేమ వేదిక అధ్యక్షుడిగా వరదా శ్రీనివాసరావు (దొరబాబు) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సీనియర్ నాయకుడు తూము గాంధీ ఆధ్వర్యంలో కాకినాడ జిల్లా, మండల నాయకులు శనివారం నగరంలో సమావేశమయ్యారు. ఈ సమావేశానికి ఆంధ్రప్రదేశ్ రేషన్ డీలర్స్ సంక్షేమ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ముత్యాల శేషగిరి రావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రభుత్వానికి, రేషన్ డీలర్స్‌కు మధ్య వేదిక వారధిగా ఉంటూ డీలర్స్ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని తీర్మానం చేశారు. ఈసందర్భంగా జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా గౌరవాధ్యక్షుడిగా తూము గాంధీ, జిల్లా అధ్యక్షుడిగా వరదా దొరబాబు, ప్రధాన కార్యదర్శిగా జెల్లా శివకుమార్, కోశాధికారిగా ఎస్ రాంబాబు, కమిటీ సభ్యులుగా ఈ కాటంరాజు, ఓరిగంటి అప్పలరాజు, డీవీ సుబ్రహ్మణ్యం, కర్రి పాపారావు, పెద్దిశెట్టి రవి, కుంచం కృష్ణ ఎన్నికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని పూలదండలతో సత్కరించారు. సమావేశంలో సంక్షేమ వేదిక రాష్ట్ర కోశాధికారి బుంగా రాజు, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి యు వెంకటేశ్వరరావు, పలు మండలాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సామాజిక తనిఖీ

జగ్గంపేట, జనవరి 4(ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా జగ్గంపేట మండలంలో 17వ సామాజిక తనిఖీ 2023-24ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మొత్తం 696 పనులకు గాను వేతనాల రూపంలో రూ.80540749, మెటీరియల్ రూపంలో రూ.27306771 మొత్తం రూ.107825606 ఖర్చు చేశారు. దీనికి గాను సామాజిక తనిఖీ సమన్వయ సమావేశం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో చంద్రశేఖర్ అధ్యక్షతన నిర్వహించారు. ఆదివారం నుంచి 16 గ్రామపంచాయతీల్లో సామాజిక తనిఖీ నిర్వహించారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక


మధ్యాహ్న భోజన పథకం ప్రారంభించిన ఎమ్మెల్యే శిరీషాదేవి దంపతులు

డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ప్రారంభం


వీఆర్‌పురం కళాశాలలో భోజన పథకాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

అడ్డతీగల: అడ్డతీగల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ష్ఠాత్మకంగా చేపట్టిన డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని స్థానిక ఎమ్మెల్యే మిరియాల శిరిషాదేవి ప్రారంభించారు. అనంతరం విద్యా ర్థులకు భోజనాలు వడ్డించి వారితోపాటు సహ బంతి భోజనాలలో పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా ఎమ్మెల్యే శిరీష మాట్లాడుతూ కళాశాల విద్యార్థులకు మధ్యహ్న భోజనం అందించాలనే కృత నిశ్చయంతో మన ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టిం దన్నారు.

వీఆర్‌పురం: మండల కేంద్రమైన వీఆర్ పురంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం డొక్కా సీతమ్మ మధ్యాహ్నభోజన పథకాన్ని జడ్పీటీసీ సభ్యులు వాళ్ళ రంగారెడ్డి, టీడీపీ మండల నాయకులు ప్రారంభించారు. కార్యక్రమంలో మండల మండల కార్యదర్శి బురక కన్నారావు, జనసేన మండల అధ్యక్షులు ములకాల సాయికృష్ణ, టీడీపీ సీనియర్ నాయకులు ముత్యాల రామారావు, ఐటిడిపి కన్వీనర్ ముత్యాల సిద్దార్థ (సిద్దు) నాయకులు బొర్ర నరేష్, బీరక సూర్యప్రకాష్‌రావు, పాయం రామారావు, బొర్ర ఆదినారాయణ, కోట్ల బాలయ్య, విద్యాకమిటీ ఛైర్మన్ శంకర్‌రావు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థిలు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: రాజవొమ్మంగి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మ ధ్యాహ్న భోజన పథకాన్ని ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రారంభించారు. ఎంపీపీ గోము వెంకటలక్ష్మీ, సర్పంచ్ గొల్లపూడి రమణి, లబ్బర్తి ఎంపీటీసీ గొల్లపూడి పెద్దిరాజు, ఎంపీడీవో యాదగిరేశ్వరావు, తహశీల్దార్ అల్లు సత్యనారాయణలు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఎంఈవో సూరయ్యరెడ్డి,జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గోపాలకృష్ణ,కళాశాల ప్రిన్సిపాల్ శిరీష తదితరులు ఉన్నారు.

దేవీపట్నం: రాష్ట్ర ప్రభుత్వం జూ నియర్ కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని మండలంలో ఇందుకూరుపేట గ్రామంలో మండల అధ్యక్షుడు మరిశెట్ల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో దేవీపట్నం సర్పంచ్ కుంజం రాజామణి, నగేష్, లంక హరిబాబు, అంజిరెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వై.రామవరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మధ్యాహ్నభోజన పథకాన్ని వై.రామవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ప్రారంభించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఈశ్వర కృప అధ్యక్షతన ఈ పథకాన్ని ప్రారంభించగా ఎంఈవో తాతబ్బాయిదొర, మండల టీడీపీ అధ్యక్షుడు పల్లాల వెంకటరమణరెడ్డి పాల్గొని విద్యార్థులకు భోజనాన్ని వడ్డించారు. అనంతరం జరిగిన సమావేశంలో రమణారెడ్డి మాట్లాడుతూ మధ్యాహ్నభోజన పథకం విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరమని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో 2, బీజేపీ మండలాధ్యక్షులు పల్లాల పండురెడ్డి, టీడీపీ మహిళా అధ్యక్షురాలు రామలక్ష్మి, మాణిక్యం పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకం సద్వినియోగం చేసుకోండి

● ఐటీడీఏ పీవో


రంపచోడవరంలో మధ్యాహ్న భోజన పథకం ప్రారంభిస్తున్న ఐటీడీఏ పీవో, సబ్ కలెక్టర్

రంపచోడవరం, డిసెంబర్4(ఆంధ్రజ్యోతి) రంపచోడవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్నాహ్న భోజన పథకాన్ని శనివారం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం, సబ్ కలెక్టర్ కల్పశ్రీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సింహాచలం మాట్లాడుతూ జూనియర్ కళాశాల విద్యార్థినీ, విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించే లక్ష్యంతో ప్రభుత్వం డొక్కా సీతమ్మ పేరుతో ఈ పథకాన్ని అమలులోకి తెచ్చిందని, దీనిని సద్వినియోగం చేసుకుని విద్యాభ్యాసంపట్ల దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. సబ్‌కలెక్టర్ కల్పశ్రీ మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకాన్ని జూనియర్ కళాశాల విద్యార్థినీ, విద్యార్థులకు వర్తింపచేయడం మంచి పరిణామమన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి కృషి ఫలితమే పరిహారం

మాజీ ఎమ్మెల్యే శీతంశెట్టి లేఖతో పోలవరం ఆర్అండ్ఆర్ పెండింగ్ బిల్లులు

దేవీపట్నం, జనవరి 4(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ చొరవతో పోలవరం ఆర్అ ండ్ఆర్ పెండింగ్ బిల్లులు శుక్రవారం ఖాతాల్లో జమయ్యాయి. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్యే శీతంశెట్టి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ముం పు గ్రామ ప్రజలు అద్దె ఇళ్లలో ఉంటూ ఎన్నో అవస్థలు పడుతున్నారన్నారు. దీనిపై సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, ప్రధాని మోదీకి పది అంశాలతో కూడిన లేఖ రాశారన్నారు. అన్నివిధాలా పోలవరం ముంపు నకు గురైన గిరిజనులు, గిరిజనేతరులను ఆదుకోవాలని వారి దృష్టికి తీసుకెళ్ళామన్నారు. దీనిపై ప్రభుత్వం వెంటనే స్పందించి నిర్వాసితులకు న్యాయం చేసిందన్నారు.

కూనవరం: కూటమి అధికారంలోకి వచ్చాక నిర్వాసితులకు న్యాయం జరిగిందని టీడీపీ మండలాధ్యక్షుడు బరపాటి ప్రకాశరావు అన్నారు. పోలవరం నిర్వాసితులకు పరిహారం అందడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయం కారణంగానే ముంపు మండలాలకు పరిహారం అందిందన్నారు. త్వరలోనే మిగతా గ్రామాలకు కూడా పూర్తిస్థాయిలో పరిహారం అందుతుందని ఆయన పేర్కొన్నారు.

ప్రధాని సీఎం, డిప్యూటీ సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం

దేవీపట్నం, జనవరి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందుకూరుపేట టీడీపీ కార్యాలయం వద్ద పోలవరం నిర్వాసితుల అకౌంట్లలో శుక్రవారం డబ్బులు జమకావడంతో మండల అధ్యక్షుడు మరిశెట్ల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, ఎమ్మెల్యే శిరీషదేవి చిత్రపటాలకు శనివారం పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో దేవీపట్నం సర్పంచ్ కుంజం రాజామణి, నగేష్, హరిబాబు, అంజిరెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కార్మికుల ఐక్యతతోనే సమస్యల పరిష్కారం

రంపచోడవరం, జనవరి4 (ఆంధ్రజ్యోతి): కార్మికుల సమస్య లన్నీ కార్మికుల ఐక్యతతోనే పరిష్కరిస్తామని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.వి.నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. శనివారం రంపచోడవరంలో జరిగిన కార్మిక సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ఎన్నికల సమయంలో అధికారంలోకి రావడం కోసం ఇచ్చిన హామీలను ఆయా ప్రభుత్వాలు విస్మరించి, కార్మికుల సంక్షేమాన్ని గాలికి వదిలేస్తున్నాయని అన్నారు. ఎక్కడా కూడా కార్మికులకు సరైన భద్రత, రక్షణ లేవని ఆయన అన్నారు. కనీస వేతనాలను కూడా అమలు చేయడంలేదని అన్నారు ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పల్లపు వెంకట్, మట్ల వాణిశ్రీ, పుట్టా రామరాజు, బి.నిర్మల, కె.రాణి, కె.రామలక్ష్మి, కొమరం చెల్లాయమ్మ, పొడియం లక్ష్మణ్ పాల్గొన్నారు.

నేషనల్ పార్కును సందర్శించిన అటవీశాఖ ప్రిన్సిపాల్ కన్జర్వేటర్

దేవీపట్నం, జనవరి 4(ఆంధ్రజ్యోతి): దేవీపట్నం పరిధిలో పాపికొండలు అభయారణ్యాన్ని శనివారం అటవీశాఖ ప్రిన్సిపాల్ కన్సర్‌వేటర్ చిరంజీవిచౌదరి తన బృందంతో సందర్శించారు. పోలవరంలో ముంపునకు గురైన గ్రామాలను సందర్శిస్తూ అభయారణ్యంలోకి పాపికొండలు మీదుగా వరరామచంద్రపురం చేరుకున్నారు. ముందుగా పోశమ్మగండిలో ఉన్న నిర్వాసితులతో మాట్లాడారు. అనంతరం పేరంటాలపల్లిలో గిరిజనులను కలిసి వారితో మాట్లాడారు. అక్కడి నుంచి చింతూరు వెళ్లారు. ఈ కార్యక్రమంలో సీసీఎఫ్ మూర్తి, రంపచోడవరం డీఎఫ్‌వో రవీంద్రరెడ్డి, ఇందుకూరు ఎఫ్ఆర్ఓ బాలకొండలరావు, కొండమొదలు ఎఫ్‌బీవోలు ప్రతాప్‌రెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పేరంటాలపల్లిలో గిరిజనులతో మాట్లాడుతున్న అటవీశాఖాధికారులు

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మధ్యాహ్న భోజన పథకం

కళాశాలల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ప్రారంభం


జగ్గంపేటలో విద్యార్థులకు భోజనాలు వడ్డిస్తున్న ఎమ్మెల్యే నెహ్రూ, ఏలేశ్వరంలో విద్యార్థులతో భోజనం చేస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

జగ్గంపేట, జనవరి 4(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంను శనివారం జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతులనెహ్రూ ప్రారంభించారు. ప్రిన్సిపాల్ వి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విద్యార్థులు, కళాశాల అధ్యాపకులు ఎమ్మెల్యేకు స్వాగతం పలికి సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం సీఎం చంద్రబాబు ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనపథకం ఇప్పటివరకు పదో తరగతి వరకు నిర్వహించే వారన్నారు. నేడు జూనియర్ కళాశాల విద్యార్థులకు ఈ భోజన పథకం వర్తిస్తుందన్నారు. ఎంపీపీ అత్తులూరి నాగబాబు, ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, కొత్త కొండబాబు,అడపా భరత్‌బాబు, మంగ రౌతు రామకృష్ణ, హైస్కూల్ హెడ్ మాస్టర్ ఏవీఎస్ రంగారావు, ప్రిన్సిపాల్ వి.శ్రీనివాసరావు, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ రాంబాబు, అధ్యాపకులుపాల్గొన్నారు.

కిర్లంపూడి: డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకానికి పేరుపెట్టిన ఘనత సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాన్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కి దక్కుతుందని కాకినాడ జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ అన్నారు. కిర్లంపూడిలో శనివారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కాసీతమ్మ మధ్యాహ్నభోజన పథకం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సారధ్యంలో కిర్లంపూడిలో డిగ్రీ కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. ఎంపీపీ తోట రవి, తోట గాంధీ, టీడీపీ మండలాధ్యక్షుడు చదరం చంటిబాబు, తూము కుమార్, కుర్ల చినబాబు, గౌతు జగన్నాధరావు, ఆళ్ల బాబులు, శ్రీరామచంద్రమూర్తి, నీలం శ్రీను, అనుకుల శ్రీకాంత్, రామ్ కుమార్, కాళ్ల వెంకటేష్, యల్లపు దొరబాబు, గంధం ప్రభాకర్, ప్రసాద్, ఎంఈవో జోసెఫ్, చిన్నారావు, సీహెచ్ ప్రకాశ్‌రావు పాల్గొన్నారు.

ఏలేశ్వరం: స్థానిక జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ప్రారంభించారు. శనివారం ప్రభు త్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని కూటమి శ్రేణులతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించి విద్యార్థులతో కలిసి భోజనం రుచి చూశారు. ప్రత్తిపాడు జనసేన ఇంచార్జ్ వరుపుల తమ్మయ్యబాబు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు మూది నారాయణస్వామి, టీడీపీ నాయకులు వీఎస్ఎన్ రాజు, కౌన్సిలర్ బొదిరెడ్డి గోపి, ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, సుబ్బరాజు, కర్రోతు గాంధీ ఉన్నారు.

తునిరూరల్: రాష్ట్రవ్యాప్తంగా ఏపీ ప్రభుత్వం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంను తునిలో మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్‌బాబు పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డి.విజయలక్ష్మి, అభివృద్ధి కమిటీ ఛైర్మన్ దంతులూరి వెంకట్‌రాజు, కార్యదర్శి మోహన్ కృష్ణ, మాజీ మున్సిపల్ ఛైర్మన్ యినిగంటి సత్యనారాయణ, మాజీ కౌన్సెలర్లు మల్ల గణేష్, సిద్ధాంతపు సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

కొత్త కొండబాబుకు ఘన సత్కారం


కొత్త కొండబాబును సన్మానిస్తున్న దృశ్యం

జగ్గంపేట, జనవరి 4(ఆంధ్రజ్యోతి): స్థానిక సర్వీసురోడ్‌లోని శ్రీ కాంప్లెక్స్ ఆవరణలో రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త వెంకటేశ్వరరావు(కొండబాబు)ను ఘనంగా గొల్లప్రోలు ఆర్యవైశ్య సేవా సంఘం, వాసవీ సంఘం ప్రముఖులు సత్కరించి భగవద్గీత జ్ఞాపిక అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. గొల్లప్రోలు వాసవీక్లబ్ వైస్ ప్రెసిడెంట్ కూచిమంచి పాపారావు మాట్లాడుతూ కొండ బాబును రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమించినందుకు సీఎం, డిప్యూటీ సీఎంలకు కృతజ్ఞతలు తెలిపారు. కూచిమంచి పాపారావు, గొల్లపూడి భాస్కరం, గొల్లపూడి సాయి చలమయ్య, కేదారి శెట్టి నానాజీ, దంగేటి శ్రీరామ్‌కృష్ణ పాల్గొన్నారు.

'ఒప్పంద అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలి'

ఏలేశ్వరం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఒప్పంద అధ్యాపకులు ఉద్యోగా లు పూర్తిస్థాయిలో క్రమబద్ధీకరణ చేయాలని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభకు వినతి పత్రం అందజేశారు. శనివారం ఏలేశ్వరం జూనియర్ కళాశాల ఆవరణలో అధ్యాపకులు పలివెల శివాజీ, వాగు మాధవ్, అనిల్, జ్యోతి తదితర అధ్యాపకులు గత 24 సంవత్సరాల నుంచి ఒప్పంద అధ్యాపకులుగా పనిచేస్తున్నామని పూర్తిస్థాయి ఉద్యోగులుగా తమను గుర్తించాలని ఎన్నో ఏళ్లుగా ఉన్న తమ సమస్యను ప్రభు త్వం దృష్టికి తెచ్చి తమకు న్యాయం జరిగేలా చర్యలుతీసుకోవాలన్నారు.

నిరుపేద విద్యార్థులకు సంక్రాంతి కానుకలు పంపిణీ

ప్రత్తిపాడు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులో నిరుపేద విద్యార్థులకు ఎస్ఎంఎస్ స్వచ్ఛంద సేవాసంస్థ శనివారం సంక్రాంతి కానుకలను పంపిణీ నిర్వహించింది. స్థానిక బజారువీధి రామాలయం వద్ద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు పడాల శ్రీనివాస రెడ్డి గీతావాణి దంపతులు నిరుపేద విద్యార్థులకు సంక్రాంతి పండుగ పురస్కరించుకుని రెడిమేట్ దుస్తులు, చీరలు, కిట్లను పంపిణీ చేశారు. మధ్యాహ్నభోజనాన్ని ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ పేదల జీవితాల్లో సంక్రాంతి పండుగ వెలుగులు నింపాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. స్వచ్ఛంద సేవా సంస్థల సభ్యులు సలాది కృష్ణ, సత్యానందం, బేరి రాంబాబు, జాజి మొగ్గల జగదీశ్వరి, కుమారి పాల్గొన్నారు.

తుని టీచర్‌కి సావిత్రిభాయి పూలే అవార్డు

తునిరూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): తునికి చెందిన ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయురాలు పొలమరి శెట్టి ఇందుదేవి సావిత్రిభాయి పూలే అవార్డుకి ఎంపిక య్యారు. ఉత్తమ ఉపాధ్యాయురాలిగా విశేషసేవలు అందిస్తున్న ఈమెకు ఈ అవార్డుకి ఎంపిక కావడంతో విజయవాడ భారత చైతన్య యువజన పార్టీ ఆధ్వర్యంలో సినీ నటి రేణుదేశాయ్, డాక్టర్‌బ్రహ్మానందం చేతులమీదుగా అవార్డు అందుకున్నారు.


అవార్డు అందుకుంటున్న టీచర్ ఇందుదేవి

బ్రెయిలీ ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలి

● ఘనంగా లూయిస్ జయంతి


కోటనందూరులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం


ధర్మవరంలో కేక్ కట్ చేస్తున్న హెచ్ఎం చిన రామమూర్తి

కోటనందూరు, జనవరి4 (ఆంధ్రజ్యోతి): అంధులు లూయిస్ బ్రెయిలీ ఆశయాలను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని ఎంఈవో ఎ.శ్రీనివాస్‌రావు తెలిపారు. శనివారం కోటనందూరు ఎంపీపీ స్కూల్‌లో భవిత కేంద్రంలో లూయిస్ బ్రెయిలీ వేడుకలు జరిగాయి. కార్యక్రమంలో ఎంఈవో రామ్‌శేఖర్, పి.రామకృష్ణ, యర్ర శేఖర్, ఐఈఆర్‌పీలు నాగగోవింద్‌నారాయణ పాల్గొన్నారు.

తుని రూరల్: లూయిస్ బ్రెయిలీ పుట్టిన రోజు పురస్కరించుకుని ఏటా నిర్వహించే వరల్డ్ బ్రెయిలీ డే తుని భవిత కేంద్రంలో ఐఆర్‌పీ ఎన్.శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఈవో గీతాదేవి హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో ఎంఈవో2 రామకృష్ణ, హెచ్ఎం నూకరత్నం, ఉపాధ్యాయులు సావిత్రి, రాంబాబు, శ్రీనివాసు పాల్గొన్నారు.

అంధుల జీవితాల్లో వెలుగు బ్రెయిలీ

ఏలేశ్వరం: అంధత్వం కల్గిన ప్రతీ ఒక్కరి ఆశా స్వప్నం లూయిస్ బ్రెయిలీ అని భవితా కేంద్రం ఉపాధ్యాయురాలు వాణీ పద్మజ అన్నారు. శనివారం ప్రాథమిక పాఠశాల ఆవరణలో బ్రెయిలీ జయంతి పురస్కరించుకొని లూయి బ్రెయిలీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులతో కేక్ కట్‌చేసి స్థానికులకు పంచారు. ప్రధానోపాధ్యాయురాలు సుమలత, రజాక్, బుజ్జి, రాజ్యలక్ష్మి, తదితరులు ఉన్నారు.

శంఖవరం: శంఖవరంలో గల భవిత పాఠశాలలో లూయిస్ బ్రెయిలీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. అంధులు, తల్లిదండ్రుల సమక్షంలో భారీ కేక్‌కట్ చేశారు. అంధుల జీవితంలో వెలుగు నింపిన వ్యక్తి లూయిస్ బ్రెయిలీ అని పలువురు అన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కే.వెంకటేశ్వరరావు, బి.నాగార్జున, డి. బహ్మానందరావు పాల్గొన్నారు.

రౌతులపూడి: అంధుల జీవితాల్లో వెగులు నింపిన మహానబావుడు లూయిస్ బ్రెయిలీ అని ప్రధానోపాధ్యాయుడు ఎస్.సింహాచలం అన్నారు. కోటవిధి పాఠశాలలో ఐఈఆర్‌టీ సిబ్బంది శ్రీనివాస్, కుమారి, అప్పారావు ఆధ్వర్యంలో బ్రెయిలీ జన్మదిన వేడుకలు నిర్వహించారు.

తొండంగి: అంధుల ఆరాధ్యదైవం లూయిస్ బ్రెయిలీ జయంతిని శనివారం మండలంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక భవిత సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఐఈఆర్టీలు జగన్నాధం, నాగేశ్వరావు, పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.

ప్రత్తిపాడు: ధర్మవరం హైస్కూల్లో గల భవిత కేంద్రంలో శనివారం లూయిస్ బ్రెయిలీ 216వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. హెచ్ఎం చిన రామమూర్తి, ఉపాధ్యాయులు, విద్యార్థులు బ్రెయిలీ చిత్రపటానికి పూలమాల వేసినివాళులర్పించారు. ప్రత్యేక ఉపాధ్యాయులు ఆర్. ఎర్రయ్య, భవిత ఉపాధ్యాయులు కుమార్‌రాజా, కృష్ణ పాల్గొన్నారు.

ఆయకట్టు బాధ్యత ఏలేరు ప్రాజెక్టు కమిటీ సభ్యులదే

● జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ


ఏలేరు ప్రాజెక్టు ఛైర్మన్ వీరబాబును సన్మానిస్తున్న ఎమ్మెల్యే నెహ్రూ

కిర్లంపూడి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ఏలేరు ప్రాజెక్టు పరిధిలో 54వేల ఎకరాల ఆయకట్టు బాధ్యత ఏలేరు ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్, సభ్యులదేనని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. శనివారం మండలంలో కిర్లంపూడి మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ తోట రవి, తోట గాంధీ ఆధ్వర్యంలో ఎంపీ డీవో హరికృష్ణ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి జగ్గంపేట ఎమ్మెల్యే నెహ్రూ హాజరయ్యారు. ముందుగా ఎంపీపీ తోట రవి సర్వసభ్య సమావేశాన్ని ప్రారంభించగా మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు. వివిధ శాఖల వారీగా అధికారులు తమ పరిధిలో ఉన్న అంశాలు వివరించారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పలు శాఖాధికారులను సమస్యలపై తెలిపారు. అనంతరం జగ్గంపేట ఎమ్మెల్యే నెహ్రూ ఏలేరు ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ బస్వా వీరబాబు, డీసీ సభ్యులను ఘనంగా సత్కరించారు.

సిటీ కేబుల్ ఎండీకి వంగా గీత పరామర్శ

తునిరూరల్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): తునికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త కేబుల్ ఎండీ చోడిశెట్టి త్రిమూర్తులు స్వామి కుమారుడు గుండెపోటుతో మృతి చెందడంతో ఆయన జిల్లాకు చెందిన పలువురు నాయకులతోపాటుగా అధికారులు ఎస్ఎన్ అన్నవరంలో త్రిమూర్తుల స్వామి నివాసంలో పరామర్శించారు. పిఠాపురానికి చెందిన మాజీ ఎమ్మెల్యే వంగా గీత, మెట్రోపేటకు చెందిన మాజీ గ్రంథాలయ ఛైర్మన్, తునికి చెందిన యనమల కృష్ణుడు, పాల్నాటి శేషగిరిరావు, పోతల రమణ, తుని పట్టణరూరల్‌తోపాటుగా ఎస్ఐలు, అధికారులు ఉన్నారు.


త్రిమూర్తులు స్వామిని పరామర్శిస్తున్న దృశ్యం

లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలు

చింతూరు, జనవరి4 (ఆంధ్రజ్యోతి): భవిత సెంటర్‌లో శనివారం లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో వీవీ లక్ష్మీనారాయణ లూయిస్ బ్రెయిలీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ దృష్టి లోపం ఉన్న పిల్లల తల్లిదండ్రులు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాలకృష్ణ, భవిత సెంటర్ ఐఈఆర్‌టీ ఆర్. శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.


లూయిస్ బ్రెయిలీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న ఎంఈవో లక్ష్మీనారాయణ


కళాజాత నిర్వహిస్తున్న కళాకారులు

మేనరికపు వివాహాలపై కళాజాత

తొండంగి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): మేనరికపు వివాహాల వలన కలిగే అనర్థాలను వివరిస్తూ శనివారం గోపాలపట్నంలో కళాజాతా నిర్వహించారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సాంబయ్య కళాబృందానికి చెందిన కామాక్షి, రాజకుమార్‌లు తమ ప్రదర్శన ద్వారా చక్కగా వివరించారు. బాల్యవివాహాల వలన, మేనరికపు వివాహాల వలన కలిగే అనర్థాలను వివరించి వాటి నుంచి తమ పిల్లల్ని దూరంగా ఉంచాలన్నారు. ఏఎన్ఎంలు, సచివాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడిగా రమేష్


రమేష్‌ని అభినందిస్తున్న సభ్యులు

శంఖవరం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్యవైశ్య యువజన సంఘం నూతన అధ్యక్షుడిగా బొండా రమేష్ ఎంపికయ్యారు. శనివారం స్థానిక ఆర్యవైశ్య భవనంలో సంఘ సభ్యులు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా రంగా లక్ష్మీనారాయణ, కార్యదర్శిగా కులుకూరి సురేష్, కోశాధికారిగా పచ్చిపులుసు వెంకటనారాయణ, గౌరవ సలహాదారుడిగా కుసుమంచి కృష్ణారావులను ఎన్నుకున్నారు. నూతనంగా ఎంపికైన అధ్యక్షుడు రమేష్ మాట్లాడుతూ తమను సంస్థను సేవారంగంవైపు తీసుకెళ్లి పేదలకు సేవ చేయాలన్నదే లక్ష్యంగా తెలిపారు. అనంతరం కార్యవర్గాన్ని సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో బొండా జగదీష్, కుసుమంచి లక్ష్మణరావు, కుసుమంచి లక్ష్మణరావు, రంగా వీరబాబు, కుసుమంచి రమేష్, కంచర్ల రాయులు, గుప్త, బొండా నగేష్ పాల్గొన్నారు.

ఆదిత్యలో ముగిసిన వర్క్‌షాప్

గండేపల్లి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరంపాలెం ఆదిత్య విశ్వవిద్యాలయం ఏపీఎస్ఎస్ డీసీ సహకారంతో ఈసీఈ విభాగంలో ఐదు రోజులపాటు ఏడబ్ల్యుఎస్ క్లౌడ్ కంప్యూటింగ్‌పై వర్క్‌షాప్ విజయవంతంగా ముగిసినట్లు డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ మేడపాటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఈ శిక్షణా తరగతులు విద్యార్థులకు ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ప్లాట్ఫార్మ్, సాఫ్ట్‌వేర్ పై వివిధ రియల్‌టైమ్ అప్లికేషన్‌లతో ఒక సేవగా బహిర్గతం చేయడానికి వీలు కల్పిస్తామని వివరించారు.

ఆదిత్యలో గెస్ట్ లెక్చర్

మండలంలోని సూరంపాలెం ఆదిత్య విశ్వవిద్యాలయంలో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యం లో అప్లికేషన్ ఆఫ్ హీట్ ట్రాన్స్‌ఫర్ ఇన్ మెకానికల్ ఇంజనీరింగ్ అనే అంశంపై గెస్ట్ లెక్చర్ నిర్వహించినట్లు డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఎన్ఐటీ ఏపీ ప్రొఫెసర్ జి.రవికిరణ్‌శాస్త్రి డైమెన్షన్ లెస్ నంబర్స్ ఇండస్ట్రీలో ఎలా ఉపయోగిస్తారో అనే విషయంపై చక్కగా వివరించారు.

ఎంపీ ఉదయ శ్రీనివాస్‌కు శుభాకాంక్షలు తెలిపిన తుమ్మల


ఎంపీ ఉదయ శ్రీనివాస్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న రమేష్

జగ్గంపేట, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కాకినాడ ఎంపీ తంగెళ్ళ ఉదయ శ్రీనివాస్‌కు కాకినాడలోని ఎంపీ నివాసంలో శనివారం జగ్గంపేట జనసేన ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్ ఎంపీపీ సత్కరించి నూతన సంవ త్సర శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట మరిసే రామకృష్ణ, మాదారపు వీరబాబు, రాజనాల శ్రీను, సూరపురెడ్డి నరేష్, కాయల మణికంఠ, పాలెం బాబీ, గంధం శ్రీనివాస్ ఉన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

జగ్గంపేట, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట మండల సర్వసభ్య సమావేశం సోమవారం ఉదయం 10.30కు ఎంపీపీ అత్తులూరి నాగబాబు ఆధ్వర్యంలో మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో జరుగుతుందని ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు.